

అనధికార బాణసంచా విక్రయదారులపై కేసులు

- 39 మంది వద్ద రూ.7.62 లక్షలు విలువైన సామగ్రి స్వాధీనం

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దీపావళి సమయంలో అనధికారికంగా బాణసంచా విక్రయిస్తున్న 39 మందిపై కేసులు నమోదుచేసినట్టు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి తెలిపారు. వారి వద్ద గల రూ.7.62 లక్షలు విలువైన బాణసంచాను సీజ్ చేశామన్నారు. గ్రీన్ క్రాకర్స్‌ను మాత్రమే కాల్చేలా తాము చేపట్టిన అవగాహన కార్యక్రమాల వల్ల గత మూడేళ్లతో పోల్చితే దీపావళి రోజున కాలుష్యం గణనీయంగా తగ్గిందన్నారు. ఇది నగరవాసుల ఆరోగ్యంతోపాటు పర్యావరణానికి మేలు చేకూర్చే విషయమన్నారు.

...అయితే ఓకే

మహా అండర్‌స్టాండింగ్

- అడ్డగోలు ప్రతిపాదనలకు సైతం ఆమోదం
- తాత్కాలిక పారిశుధ్య కార్మికుల పేరుతో అవినీతి జరుగుతోందంటూ అధికారులపై మేయర్ అసంతృప్తి వ్యక్తం చేసిన 24 గంటల్లోనే దాదాపు వెయ్యి మందికి వేతనాల చెల్లింపునకు గ్రీన్‌సిగ్నల్
- 200 లీటర్ల సామర్థ్యం కలిగిన ప్లాస్టిక్ డ్రమ్ము రూ.2,000కు, 120 లీటర్ల డ్రమ్ము రూ.1,200కు కొనుగోలు చేసినట్టు బిల్లు పెట్టిన కాంట్రాక్టర్
- రెండింతలు ఎక్కువ ధర చూపించడంపై ఒక సభ్యురాలు అభ్యంతరం
- ఆ తరువాత మౌనం
- మొత్తమ్మీద 212 అంశాలు ఆమోదం... ఐదు వాయిదా
- అజెండాలోని అంశాల ఆమోదంలో చక్రం తిప్పుతున్న ప్రైవేటు వ్యక్తి



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, సభ్యులు

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతి చోటుచేసుకున్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ అనేక అంశాలను ఆమోదించడానికి కారణం పెద్దమొత్తంలో చేతులు మారడమేననే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశానికి 205 అంశాలతో ప్రధాన అజెండా, మరో 12 అంశాలతో టేబుల్ అజెండాను తయారుచేశారు. వాటిపై చర్చించిన సభ్యులు ప్రధాన అజెండాలో కుక్కల పట్టివేతకు వాహనాలు సమకూర్చడం, మనుషులను నియమించుకోవడంతోపాటు పాములు పట్టేందుకు జోన్ల వారీగా నియమించిన వారికి రూ.పది వేల గౌరవ వేతనం చెల్లింపు అంశాలను వాయిదావేశారు. టేబుల్ అజెండాలో నాలుగేళ్ల కిందట జూనియర్ అసిస్టెంట్ నియామకం, కుక్కలకు ఆపరేషన్లు చేసేందుకు రూ.1,500 చొప్పున చెల్లింపు అంశాలను వాయిదా వేశారు. మిగిలిన 212 అంశాలకు ఆమోదం తెలిపారు. అజెండాలో ప్రజారోగ్య విభాగానికి సంబంధించిన అనేక అంశాలపై తీవ్రస్థాయిలో అవినీతి ఆరోపణలు ఉన్నాయి.

జీవీఎంసీ పరిధిలో పారిశుధ్య నిర్వహణకు రెగ్యులర్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు దాదాపు ఏడు వేల మంది పనిచేస్తుండగా, అదనంగా రోజువారీ వేతనం చెల్లించే ప్రాతిపదికన సుమారు మూడు వేల మందిని నియమించినట్టు అధికారులు లెక్కలు చెప్పడంపై మేయర్ పీలా శ్రీనివాసరావు గతంలో పలుమార్లు అభ్యంతరం వ్యక్తంచేశారు. తాత్కాలిక కార్మికుల పేరుతో పెద్దఎత్తున అవినీతి జరుగుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. నగరంలో రాత్రిపూట పారిశుధ్య నిర్వహణను ఆయన పలుమార్లు స్వయంగా తనిఖీ చేశారు. ఒకసారి ఆరుగురు, మరోసారి నలుగురు కార్మికులు లేకపోయినా విధులు నిర్వర్తిస్తున్నట్టు హాజరు పట్టికలో చూపించినట్టు గుర్తించారు. మంగళవారం తన ఛాంబర్‌లో జోనల్ కమిషనర్లతో సమావేశం ఏర్పాటుచేసి తాత్కాలిక పారిశుధ్య సిబ్బంది పేరుతో పెద్దఎత్తున అవినీతి జరుగుతోందని స్వయంగా మేయర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో తాత్కాలిక పారిశుధ్య కార్మికుల వేతనాల చెల్లింపు అంశాన్ని బుధవారం నాటి స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో తిరస్కరిస్తారని అంతా భావించారు. ఆయా అంశాలపై చర్చ జరిగినప్పుడు మొదట్లో సభ్యులు అభ్యంతరం తెలపడంతో వాటిపై పూర్తి వివరాలు అందజేసేంత వరకు వాయిదా వేస్తున్నట్టు మేయర్ ప్రకటించారు. తర్వాత ఏమైందోగానీ సభ్యులు పారిశుధ్య కార్మికులకు సంబంధించిన అంశాలన్నింటినీ ఆమోదించేయడం అక్కడున్న వారందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. తాజా అంశాలతోపాటు 16 నెలల కిందట పనిచేసిన కార్మికులకు జీతాల చెల్లింపు ప్రతిపాదనలను సైతం ఆమోదించేశారు. పెద్దఎత్తున కమీషన్ ఇచ్చేందుకు కాంట్రాక్టర్లు అంగీకరించడమే అందుకు కారణమనే ఆరోపణలు ... మిగతా 6వ పేజీలో

మరింత సమర్థంగా ఆహార భద్రతా విభాగం

పక్షం రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక

- సిబ్బంది కొరతను అధిగమించేందుకు సచివాలయ ఉద్యోగులను వినియోగించుకోవచ్చు
- ఆహార భద్రతలో ఏపీది 29వ స్థానం
- శాసనసభ ఫిర్యాదుల కమిటీ చైర్మన్ కె.రఘురామకృష్ణరాజు



సమీక్ష సమావేశంలో శాసనసభ ఫిర్యాదుల కమిటీ చైర్మన్ కె.రఘురామకృష్ణరాజు, సభ్యులు పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, విష్ణుకుమార్‌రాజు, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): 'ఆహార భద్రతా విభాగం మరింత సమర్థంగా పనిచేసేలా చూస్తాం. ఇందుకోసం తగిన సూచనలు చేస్తూ పక్షం రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం' అని శాసనసభ ఫిర్యాదుల కమిటీ చైర్మన్, ఉప సభాపతి కె.రఘురామకృష్ణరాజు అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం కమిటీ నేతృత్వంలో సమీక్ష నిర్వహించిన అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఆహార భద్రతా విభాగానికి సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది. విభాగంలో 500 మందికిగాను 54 మంది మాత్రమే ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సిబ్బంది కొరతను అధిగమించేందుకు సచివాలయాల్లో అర్హులైన ఉద్యోగుల సేవలు వినియోగించుకోవచ్చు. దీనిపై ప్రభుత్వానికి సూచన చేస్తాం. సుమారు 200 నుంచి 250 మంది సచివాలయ ఉద్యోగులను ఆహార భద్రతా విభాగానికి తీసుకుంటే కొంత వరకు కొరతను అధిగమించవచ్చు. దీనికి మా కమిటీ మొదటి ప్రాధాన్యం ఇస్తుంది. నాలుగు నెలల్లో ఈ విభాగాన్ని పటిష్ఠం చేసేందుకు కృషి చేస్తాం. రాష్ట్రంలో ల్యాబ్‌ల కొరత కూడా ఉంది. విశాఖపట్నంలో ఏడాది క్రితం ప్రారంభించిన లేబొరేటరీలో పరీక్షల నిర్వహణకు అవసరమైన సిబ్బంది లేరని అధికారులు మాకు వివరించారు. నవంబరు తొలి వారం నుంచి విశాఖ ఫుడ్ లేబొరేటరీలో పరీక్షలు నిర్వహించేలా చూస్తాం. ఆహార భద్రత విషయంలో దేశంలో ఏపీ 29వ స్థానంలో ఉంది. ఆహార కల్తీ ఎక్కువగా ఉంది. ఈ విభాగంపై ఎక్కువగా ఫిర్యాదులు ... మిగతా 6వ పేజీలో

ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందాలి

- అధికారులకు శాసనసభ పక్ష ఫిర్యాదుల కమిటీ చైర్మన్,డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఆదేశం

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం, సురక్షిత తాగు నీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని శాసనసభ పక్ష ఫిర్యాదుల కమిటీ చైర్మన్, డిప్యూటీ స్పీకర్ కె.రఘురా మకృష్ణరాజు ఆదేశించారు. కల్తీలేని ఆహారం అందించాల్సిన నైతిక బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

వివిధ ఫిర్యాదుల పరిశీలనలో భాగంగా శాసన సభాపక్ష ఫిర్యాదుల కమిటీ బుధవారం నగరానికి విచ్చేసింది. ముందుగా వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోని అంశాలపై సమీక్షించింది. హీమోఫీలియా వ్యాధిగ్రస్తులను ప్రత్యేకంగా పరిగణించి, మెరుగైన వైద్యం అందించాలని ... మిగతా 6వ పేజీలో

చిటికెలో విద్యుత్ కనెక్షన్

దరఖాస్తుతో పాటు స్థిర చార్జీలు చెల్లిస్తే వెంటనే ఆదేశాలు

- ఈపీడీసీఎల్ కొత్త విధానం
- రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా శ్రీకారం

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కనెక్షన్ల జారీకి ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) కొత్త విధానం అమలులోకి తీసుకువచ్చింది. ఇప్పటివరకూ కొత్త కనెక్షన్ కావాలంటే దరఖాస్తు సమర్పించిన తరువాత స్థల పరిశీలన చేసి, ఎంత వ్యయం అవుతుందో అంచనా వేసేవారు. దానిపై సర్వీస్ లైన్ చార్జీలు, డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేసేవారు. తనిఖీకి వచ్చిన అధికారి విచక్షణపై ఈ మొత్తం ఆధారపడి ఉండేది. ఈ ప్రక్రియకు కొంత సమయం పట్టేది.

ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ఈజ్ ఆఫ్ లివింగ్‌ను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ విద్యుత్ వినియోగదారుల చట్టం 2020కి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి కొన్ని సవరణలు చేయడంతో ఏపీఈపీడీసీఎల్ కొత్త విధానం తీసుకువచ్చింది. 150 కిలోవాట్ల వరకు కనెక్షన్లకు ఫిక్స్‌డ్ చార్జీలు నిర్ణయించారు. ఈ మొత్తాన్ని దరఖాస్తుతో పాటు చెల్లిస్తే వెంటనే కనెక్షన్ ఇవ్వాలని ఆదేశాలు జారీ అయిపోతాయి. దీనివల్ల చాలా తక్కువ సమయంలో విద్యుత్ సదుపాయం లభిస్తుంది. సైట్ ఇన్‌స్పెక్షన్, ఎస్టిమేషన్ వంటివి ఇందులో ఉండవు.



ఎవరికి వర్తిస్తుందంటే..?

ఇప్పటికే విద్యుత్ సదుపాయం ఉన్న ప్రాంతానికి కిలోమీటరు పరిధిలో ఉన్నవారు కొత్త కనెక్షన్ తీసుకుంటే చార్జీలు ఇలా ఉంటాయి.

- గృహ వినియోగదారులకు మొదటి కిలోవాట్‌కు రూ.1,500.
- వాణిజ్య వినియోగదారులకు మొదటి కిలోవాట్‌కు రూ.1,800

...ఆపై ప్రతి అదనపు కిలోవాట్‌కు రూ.2 వేలు చొప్పున తీసుకుంటారు. ఇలా 20 కిలోవాట్ల వరకూ లెక్కించి తీసుకుంటారు.

ఇవికాకుండా కనెక్షన్ లోడ్ చార్జీల (డొమెస్టిక్) కింద సర్వీస్ లైన్, డెవలప్‌మెంట్ చార్జీలు కలిపి 500 వాట్ల వరకు రూ.800, ఆపై 501 నుంచి 1000 వాట్ల వరకు రూ.1,500 చెల్లించాల్సి ఉంటుంది..

> **ముందుగా చెల్లించడంతో తక్షణ సేవలు**
>
> స్థిరమైన చార్జీలు ముందుగానే నిర్ణయించడం వల్ల ఎస్టిమేషన్ పేరుతో జాప్యం ఉండదు. విచక్షణా అధికారంతో అంచనాలు పెంచే అవకాశమూ లేదు. ఎవరికి ఎంత విద్యుత్ లోడ్ పడుతుందో లెక్కించుకొని ఆ మేరకు చార్జీలు చెల్లిస్తే సరిపోతుంది. దీని వల్ల తక్షణమే సేవలు అందించగలుగుతాము. ఇదంతా పూర్తి పారదర్శకంగా ఉంటుంది.
>
> పృథ్వీతేజ్, సీఎండీ, ఏపీఈపీడీసీఎల్

నాన్ డొమెస్టిక్/కమర్షియల్ కనెక్షన్లకు...

మొదటి 250 వాట్ల వరకు రూ.600, 251 వాట్ల నుంచి 500 వాట్ల వరకు రూ.1,000 కట్టాలి. ఇలా ఎల్‌టీ-3, ఎల్‌టీ-4, హెచ్‌టీ కనెక్షన్ కోరుకునే వారికి చార్జీలు నిర్ణయించారు.

ఆయనపై ఆరోపణలు అనేకం

వైసీపీ హయాంలో విజయనగరం ఆర్డీవోగా చక్రం తిప్పిన భవానీశంకర్

- ఫ్రీహోల్డ్‌కు అనుమతుల్లో నిబంధనలు ఉల్లంఘించారని అభియోగాలు
- ఇంట్లో సరుకుల కోసం ఇండెంట్లు?



భవానీశంకర్

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా డీఆర్‌ఓగా పనిచేసి అమరావతికి బదిలీ అయిన భవానీశంకర్‌పై అనేక ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో టైపిస్టు పోస్టులకు సంబంధించిన నియామకాల్లో ఆర్థిక శాఖకు ఫైల్ పంపించి క్లియరెన్స్ తీసుకోకుండానే కోర్టు ఆదేశాల పేరుతో ఉత్తర్వులు ఇచ్చేశారు. ఇందులో భారీగా లబ్ధి పొందారని ప్రచారం ఉంది. అలాగే తన ఇంటికి అవసరమైన సరకులను తహశీల్దార్ కార్యాలయాల సిబ్బందితో కొనిపిస్తారని ఆర్‌డీఓ శ్రీలేఖ చేసిన ఫిర్యాదులోను కొంత వాస్తవం ఉందని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. విశాఖలోని ఇంటితో పాటు శ్రీకాకుళంలో కుటుంబానికి అవసరమైన సరకులకు కూడా ఇక్కడే ఇండెంట్ ఇవ్వడం విశేషం.

ఆయన ఇంతకు ముందు వైసీపీ హయాంలో విజయనగరం జిల్లాలో ఆర్డీవోగా పనిచేశారు. డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ల జారీకి సంబంధించి 2022లో అప్పటి విజయనగరం జాయింట్ కలెక్టర్ కిశోర్‌ను నాటి కలెక్టర్ సరండర్ చేశారు. ఇదే వ్యవహారంలో ఆర్‌డీఓ భవానీశంకర్‌తో పాటు మరో నలుగురు తహశీల్దార్లపై కూటమి ప్రభుత్వం వచ్చాక విచారణకు ఆదేశించింది. భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ, జామి మండలాల్లో డీపట్టా భూములను ఫ్రీహోల్డ్ చేయడంలో నిబంధనలను అతిక్రమించారనేది ప్రధాన ఆరోపణ.

అలాగే భోగాపురం ఎయిర్‌పోర్టు పరిసరాల్లో ఉన్న డీపట్టా భూములు కొనుగోలు చేసిన వారికి పలు విధాలుగా సహాయపడ్డారు. ఉన్నత స్థాయిలో వచ్చిన ఒత్తిడి మేరకు భవానీశంకర్‌పై చర్యలు తీసుకోకుండా వదిలేశారనేది ప్రధాన ఆరోపణ. ఇంత జరిగిన తరువాత కీలకమైన విశాఖలో డీఆర్వోగా భవానీశంకర్‌ను నియమించారు. ఈ విషయంలో సీఎంఓలోని ఒక కీలక వ్యక్తి ప్రమేయం ఉందని చెబుతారు. ఇదిలావుండగా వైసీపీ హయాంలో పెందుర్తి మండలం ఎస్.ఆర్.పురంలో సుమారు 100 ఎకరాల డీపట్టా భూములను లోపాయికారీగా కీలక ఉన్నతాధికారి ఒకరు బినామీ పేర్లతో కొన్నారు. వాటిని ఫ్రీహోల్డ్ చేయడానికి ప్రతిపాదనలు సిద్ధంచేసే సమయంలో (2024) ఎన్నికలు రావడంతో పెండింగ్‌లో పెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ ఫ్రీహోల్డ్ వ్యవహారంపై విచారణ చేపట్టింది. మొత్తం ప్రక్రియను పెండింగ్‌లో పెట్టేసింది. అయితే ఎస్ఆర్.పురంలో భూములు కొనుగోలు చేసిన పెద్దాయన వ్యవహారాన్ని చక్కబెట్టే బాధ్యతను డీఆర్వోకు అప్పగించారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిని విశాఖ ఆర్డీఓ శ్రీలేఖ అడ్డుకోవడంతో విభేదాలు ఎక్కువయ్యాయంటున్నారు. ఇదే పెందుర్తి మండలం ఏకలవ్య ... మిగతా 6వ పేజీలో

రాజకీయ ప్రయోజనం కోసమే గూగుల్‌పై అసత్య ప్రచారం

- విపక్షాలపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ధ్వజం



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఏర్పాటుకానున్న గూగుల్ డేటా సెంటర్‌పై కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం శాసనసభా పిర్యాదుల కమిటీ సమీక్షకు హాజరైన ఆయన అనంతరం చైర్మన్ రఘురామకృష్ణరాజుతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ గూగుల్ సంస్థ విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు రూ.1.3 లక్షల కోట్లు పెట్టుబడి పెడుతుందన్నారు. దీంతో విశాఖలో ఐటీ రంగం విస్తరణకు అనువైన వాతావరణం నెలకొంటుందన్నారు. డేటా సెంటర్ రాకతో ప్రపంచపటంలో విశాఖ ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ మంత్రి నారా లోకేశ్ చొరవతో విశాఖకు ఐటీ దిగ్గజ కంపెనీలు వస్తున్నాయని పల్లా శ్రీనివాసరావు అన్నారు. వారి కృషి ఫలితంగానే గూగుల్ విశాఖకు వచ్చిందని, అయితే కొందరు డేటా సెంటర్ వస్తే ఇబ్బందులు వస్తాయని ... మిగతా 6వ పేజీలో

తిరుపతి రైళ్లు ఫుల్

తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో డిసెంబరు 16 వరకూ బెర్తులు రిజర్వు

- హౌరా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లోనూ అదే పరిస్థితి
- వారాంతపు రైళ్లకు తీవ్ర డిమాండ్
- విశాఖ-తిరుపతి ప్రత్యేక రైలు, డబుల్ డెక్కర్‌లో ఖాళీలు



విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైళ్లకు డిమాండ్ కొనసాగుతోంది. విశాఖ నుంచి ప్రతిరోజూ నడిచే విశాఖ-తిరుపతి/కడప తిరుమల ఎక్స్‌ప్రెస్ (18521)లో డిసెంబరు 16 వరకూ అన్ని తరగతుల బెర్తులు ఇప్పటికే రిజర్వు అయిపోయాయి. తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు ఏడాది పొడవునా డిమాండ్ ఉంటోంది. అలాగే విశాఖ మీదుగా రోజూ నడిచే హౌరా-యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్ (12863)లో కూడా డిసెంబరు 16 వరకు బెర్తులు లభించే పరిస్థితి లేదు.

ప్రత్యేక రైలు, డబుల్ డెక్కర్‌లో ఖాళీలు

ప్రతి బుధవారం విశాఖ నుంచి తిరుపతికి నడుపుతున్న ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు (08547)లో ఈ నెల 29, నవంబరు 5, 12, 19, 26 తేదీల్లో బెర్తులు అందుబాటులో ఉన్నాయి. అలాగే మంగళ, గురు, శనివారాల్లో విశాఖ నుంచి బయలుదేరే డబుల్ డెక్కర్ (22707) ఎక్స్‌ప్రెస్‌లో సీట్లు ఖాళీ ఉన్నాయి. డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రవేశపెట్టినప్పటి నుంచి ఆక్యుపెన్సీ అంతంత మాత్రంగానే ఉంది. ఈ రైలు విశాఖ నుంచి బయలుదేరే సమయం (రాత్రి 11 గంటలకు)తోపాటు తిరుపతి చేరే సమయం (మధ్యాహ్నం 12.30 గంటలకు) అనుకూలంగా లేకపోవడం ఒక కారణమైతే, సుమారు 14 గంటలపాటు కూర్చొని ప్రయాణించాల్సి రావడంతో ప్రయాణికులు ఆసక్తి చూపడం లేదన్న అభిప్రాయాలు ఉన్నాయి. ప్రతి సోమ, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో విశాఖ మీదుగా నడిచే పూరి-తిరుపతి ... మిగతా 6వ పేజీలో



విమానాశ్రయంలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

గవర్నర్‌కు స్వాగతం

గోపాలపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నగర పర్యటనకు వచ్చిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. బుధవారం రాత్రి 9.15 గంటలకు విజయవాడ నుంచి విశాఖ చేరుకున్న గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, డీసీపీ మేరీ ప్రశాంతి, తదితరులు స్వాగతం పలికారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీనియర్ లెక్చరర్ ఉపేంద్రరావు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'దీక్షారంభం'

తగరపువలస, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం బుధవారం నుంచి దీక్షారంభం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. శ్రీవాణి మాట్లాడుతూ విద్యార్థులకు బోధన, బోధనేతర అంశాలపై తర్ఫీదు ఇవ్వడానికి ఈ కార్యక్రమాన్ని రూపొందించామని చెప్పారు. సీనియర్ లెక్చరర్ ఎం. ఉపేంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని, అందుకు అనుగుణంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు బి. సీతం నాయుడు, డా. సీతా రత్నం, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మగ్గం శిక్షణ

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిప్పాడ దివీస్ కంపెనీ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో మూడు నెలలుగా మహిళలకు ఇచ్చిన మగ్గం శిక్షణ బుధవారంతో ముగిసింది. శిక్షణ పూర్తి చేసుకున్న 40 మంది మహిళలకు దివీస్ మేనేజరు ఎంఎస్ఎన్ రావు, పి. జగదీశ్ ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివీస్ పరిసర ప్రాంతాల్లో ఉన్న మహిళల స్వయం ఉపాధి కోసం పలు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దివీస్ కంపెనీ సీఎస్ఆర్ విభాగం మేనేజర్ డి. సురేశ్‌కుమార్, ప్రతినిధులు శ్రీనివాస్, బిందు శిరీష, తదితరులు పాల్గొన్నారు.

250 మందికి నేత్ర వైద్య పరీక్షలు

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విశాఖ కంటి ఆసుపత్రి వైద్యులు బుధవారం ఉచిత నేత్ర వైద్య పరీక్షలు చేశారు. వైద్యులు సాయికృష్ణ, వంశీకృష్ణ, శివరాం, తదితరులు 250 మంది విద్యార్థులను పరీక్షించి, అవసరమైన వారికి కంటి మందు వేశారు. అలాగే కళ్ల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం డి. సత్యారావు, ఉపాధ్యాయులు ఆర్. అప్పారావు, పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఏడు మద్యం బాటిళ్లు స్వాధీనం

సింహాచలం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : అనధికార మద్యం విక్రయాలు చేపడితే చర్యలు తప్పవని గోపాలపట్నం స్టేషన్ హౌస్ ఆఫీసర్ లంక సన్యాసినాయుడు స్పష్టం చేశారు. బుధవారం 98వ వార్డులో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీనగర్‌లో కొన్ని ఇళ్లు తనిఖీ చేశారు. రోడ్డు పక్కన దుకాణంలో ఏడు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని మహిళపై కేసు నమోదు చేశారు.

రోడ్డు పనులు పరిశీలన

సింహాచలం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు పనుల్లో ఎక్కడా నాణ్యతా లోపం లేకుండా చూడాలని కార్పొరేటర్ పిసిని వరాహ నరసింహం సూచించారు.మార్నింగ్ వాక్‌లో భాగంగా బుధవారం ఆయన సింహపురి కాలనీలో జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు.

నేటి నుంచి ఆర్జిత సేవలు రద్దు

సింహాచలం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) :మనవాళ్ల మహామునుల తిరు నక్షత్ర ఉత్సవాలు పురస్కరించుకుని వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరిగే పలు ఆర్జిత సేవలు గురువారం నుంచి రద్దు చేసినట్టు ఈఓ వేండ్ర త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ ప్రభాతారాధనలు తరువాత జరిగే నిత్య కల్యాణం, గరుడసేవ, సహస్ర నామ తులసీ దళార్చన, స్వర్ణ పుష్పార్చన వంటి ఆర్జిత సేవలు ఈనెల 27వ తేదీ వరకు ఉండవని చెప్పారు. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని ఆయన సూచించారు.

ప్రింట్ మీడియా పాత్ర కీలకం

భీమునిపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రింట్ మీడియా పాత్ర కీలకమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఎంవీపీ కాలనీలో ఉన్న క్యాంప్ కార్యాలయంలో భీమిలి ప్రింట్ మీడియా సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రింట్ మీడియా లోగోను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సమాజం సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా.. ప్రింట్ మీడియాకు ఎప్పుడూ ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి ప్రింట్ మీడియా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిలారి మోహనరావు, సుత్తి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు లచ్చుబుగత గణపతిరావు, కోశాధికారి ఆరంగి రోజా, సహాయ కార్యదర్శి ముద్దాడ రాజు, కార్యనిర్వాహక కార్యదర్శి రాజేటి బసవ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వృషభోత్సవం

సింహాచలం,అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణాపురంలోని నృసింహ వనం గోశాలలో వృషభోత్సవం పేరుతో గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం వృషభ పూజ చేశారు. సింహాచలం దేవస్థానం అర్చకుడు సంతోష్‌శర్మ తొలుత లోక కల్యాణార్థం అన్న సంకల్పంతో శ్రీకారం చుట్టి ఉపచారాలు సమర్పించారు. అనంతరం భక్తులు వృషభాలకు పసుపు కుంకుమతో పూజలు చేసి ప్రత్యేక నివేదనలు సమర్పించారు.

తిరుపతి రైళ్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

ఎక్స్‌ప్రెస్ (17479), ప్రతి ఆది, బుధవారాల్లో అందుబాటులో ఉండే బిలాస్‌పూర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్ (17481) రైళ్లకు నవంబరులో బెర్తులు లభించే పరిస్థితి ఉంది.

వారాంతపు, బైవీక్లీ రైళ్లకు తీవ్ర డిమాండ్

విశాఖ మీదుగా నడిచే వారాంతపు, బైవీక్లీ రైళ్లకు కూడా తీవ్ర డిమాండ్ ఏర్పడింది.ప్రతి శనివారం నడిచే భువనేశ్వర్-తిరుపతి (22879) ఎక్స్‌ప్రెస్‌కు డిసెంబరు 20 వరకు, అలాగే ప్రతి ఆదివారం భువనేశ్వర్‌లో బయలుదేరి విశాఖ మీదుగా తిరుపతి వెళ్లే భువనేశ్వర్-తిరుపతి (22871) ఎక్స్‌ప్రెస్‌కు డిసెంబరు 21 వరకు బెర్తులు నిండిపోయి నిరీక్షణ జాబితా ఏర్పడింది. ఖరగ్‌పూర్-విల్లుపురం (22603), సంత్రాగచ్చి-మంగళూరు వివేక్ ఎక్స్‌ప్రెస్ (22815),భగల్‌పూర్-బెంగళూరు అంగా ఎక్స్‌ప్రెస్ (12254), షాలిమార్-నాగర్‌కోయిల్ గురుదేవ్ ఎక్స్‌ప్రెస్ (12660). పురిలియా-విల్లుపురం (22605), హటియా-బెంగళూరు (18637), భువనేశ్వర్-బెంగళూరు (12845), హౌరా-తిరుపతి హంసఫర్ (20889), సంత్రాగచ్చి-తిరుపతి (22855), హౌరా-పాండిచ్చేరి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12867) రైళ్లకు తీవ్ర డిమాండ్ ఏర్పడింది.

షిర్డీ రైలుకు నవంబరు 20 వరకూ బెర్తులు ఫుల్

విశాఖ నుంచి ప్రతి గురువారం బయలుదేరే సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ (18503)లో నవంబరు 20 వరకూ బెర్తులు రిజర్వు అయిపోయాయి. నవంబరు 27 నుంచి డిసెంబరు 18 వరకు బెర్తులు లభ్యమవుతున్నాయి.వారానికి ఒక్కరోజు మాత్రమే ఈ రైలు అందుబాటులో ఉన్న నేపథ్యంలో షిర్డీ ఎక్స్‌ప్రెస్‌కు ఆక్యుపెన్సీ పెరుగుతోంది. షిర్డీ వెళ్లే వారికి ప్రత్యామ్నాయంగా విశాఖ-ఎల్‌టీటీ వయా సికింద్రాబాద్ (18519), విశాఖ-ఎల్‌టీటీ వయా రాయగడ (22847), కోణార్క్ (11020) ఎక్స్‌ప్రెస్ రైళ్లలో మన్మాడ్ వరకు వెళ్లే అవకాశం ఉన్నా ఎక్కువగా సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్‌కే ప్రాధాన్యమిస్తారు.

తర్లువాడకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు

- గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో మార్మోగుతున్న పేరు
- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- ఆనందపురంలో టీడీపీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం


నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే గంటా

ఆనందపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కూటమి తరపున అభ్యర్థులను గెలిపించుకుని సత్తా చాటాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన టీడీపీ మండల నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారంలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో 26 పంచాయతీల్లో తనకు మెజారిటీ ఇచ్చిన విధంగానే స్థానిక ఎన్నికల్లో కూడా ఏకపక్ష ఫలితాలు తీసుకురావాలని చెప్పారు.పార్టీకి ఆనందపురం మండలం ఎప్పుడూ కంచుకోటేనని, పదవిని బాధ్యతగా భావించి మరింత బలోపేతం చేయాలని నూతన కార్యవర్గానికి సూచించారు. కూటమి నాయకులు వర్గ విభేదాలు పక్కన పెట్టి సమష్టిగా పనిచేయాలన్నారు. గూగుల్ డేటా సెంటర్ రాకతో తర్లువాడ పేరు ప్రపంచ వ్యాప్తంగా మార్మోగిపోతోందని తెలిపారు. భూములు తీసుకునే కంపెనీతో పాటు భూములిచ్చిన రైతులు కూడా ఆనందంగా ఉండాలని, అందుకు అవసరమైతే ప్రభుత్వ పాలసీని మార్చడానికి కూడా సిద్ధమని, తర్లువాడ రైతులకు నష్టపరిహారం విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారన్నారు. భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారంతో పాటు ఉద్యోగాలు, ఉపాధి, ఇళ్ల స్థలాలు ఇస్తామని తెలిపారు. గంభీరం ఐఐఎం భూసేకరణ విధానం దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు.టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్, సిఫి, సత్వా వంటి కంపెనీల రాకతో విశాఖ ఐటీ హబ్‌గా మారనుందని చెప్పారు. పథకాల అమలులో వైసీపీ ప్రభుత్వం ప్రజలను దారుణంగా మోసం చేయగా, కూటమి ప్రభుత్వం షరతులు లేని సంక్షేమం అందిస్తుందన్నారు. తొలుత ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నుంచి తర్లువాడ జంక్షన్ వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, ఉపాధ్యక్షుడు సురాల సత్యవరప్రసాదరావు, కార్యదర్శి లొడగల వెంకటరావు,తర్లువాడ సర్పంచ్ నాయుడు, నాయకులు గంట్రెడ్డి స్వామినాయుడు, కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, చిక్కాల విజయ్‌బాబు, కాకర రమణ, బంక్ రాజు పాల్గొన్నారు.


సింహాచలంలో శివునికి అభిషేకాలు చేస్తున్న భక్తులు


గెద్దపేట లక్ష్మీగణపతి ఆలయంలో ఆకాశ దీపం వెలిగిస్తున్న భక్తులు

కార్తీక మాసం పూజలు ప్రారంభం

సింహాచలం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు పరిధిలోని పలు శివాలయాల్లో బుధవారం నుంచి కార్తీక మాసం పూజలు ప్రారంభమయ్యాయి. సింహగిరిపై గంగధారలో, మెట్ల మార్గంలోని జలధారల్లో భక్తులు స్నానాలు చేసి, క్షేత్ర పాలకుడు త్రిపురాంతక స్వామిని, బాలత్రిపుర సుందరీ అమ్మవారిని దర్శించుకు న్నారు. అలాగే ప్రధాన రాజగోపురం సమీపంలోని కాశీవిశ్వేశ్వరుడ్ని కూడా దర్శించుకుని పూజలు జరిపారు. అడివివరం, విజినిగిరిపాలెం, సాయినగర్, సింహాచలనగర్ ప్రాంతాల్లోని క్షేత్రాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి.

పద్మనాభం/రూరల్ : కోరాడ పంచాయతీ గెద్దపేటలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సహిత లక్ష్మీగణపతి ఆలయంలో శివునికి పంచామృతాభిషేకాలు చేసి పూజలు నిర్వహించారు. ఆకాశదీపాన్ని ఆలయ ధ్వజ స్తంభం వద్ద వెలిగించారు. పద్మనాభంలో నారాయణేశ్వరాలయం, మద్దిలో కాశీ విశ్వేశ్వరాలయం, విలాస్కాన్‌పాలెంలో రామలింగేశ్వరాలయం, పొట్నూరులో ఉమా నీలకంఠేశ్వరాలయం, కుద్రపల్లి శివాలయంలోనూ పూజలు ప్రారంభించారు. అనంతవరం ధారకొండ వద్ద ఉన్న శ్రీమన్నారాయణేశ్వర ఆలయంలో కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శివునికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

పరిశుభ్రత ముఖ్యం


చెత్త సేకరణ బళ్లును అందిస్తున్న గురునాథ్

కొమ్మాది, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆరో వార్డు టీడీపీ నాయకుడు, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు గరే గురునాథ్ అన్నారు. బుధవారం ఆయన పారిశుధ్య కార్మికులకు జీవీఎంసీ మంజూరు చేసిన చెత్త సేకరణ బళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరో వార్డు జనసేన అధ్యక్షుడు సంతోష్‌నాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాయి, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు వినతి

కొమ్మాది, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఐదో వార్డులో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ మొల్లి హేమలత కోరారు. బుధవారం ఆమె జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ పీలా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ వార్డులో పాడైన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని, శారదానగర్ కొండవాలు ప్రాంతానికి, హుద్‌హుద్ కాలనీకి తాగునీటి సౌకర్యం కల్పించాలని విన్నవించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ముగ్గురి ఎంపిక

తగరపువలస, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. విజయనగరం జిల్లా నెల్లిమర్లలో రామకృష్ణ ధ్యాన మందిరంలో ఈనెల 19న జరిగిన జిల్లాస్థాయి యోగా పోటీలకు 150 మంది హాజరు కాగా వారిలో 43 మందిని నిర్వాహకులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అందులో అవంతి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన జామి తేజస్విని, జన్ని నిఖిల, బన్నా నిఖిత ఉన్నారని ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు. ఈమేరకు బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ చంద్రశేఖర్, పీడీ కోలా చంద్రశేఖర్,ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త షరీఫ్, తదితరులు విద్యార్థినులను అభినందించారు.

గీతంలో ఉచిత వైద్య శిబిరం

ఎండాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గీతం ఆసుపత్రిలో బుధవారం ఎముకల వ్యాధికి సంబంధించి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆస్టియో పోరోసిస్ దినోత్సవం పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఆయనపై ఆరోపణలు అనేకం

... 5వ పేజీ తరువాయి

నగర్‌లో అంబేడ్కర్ విగ్రహం తొలగింపు వివాదంలో తనకు కలెక్టర్ షోకాజ్ నోటీస్ జారీ చేయడం వెనుక డీఆర్వో ప్రమేయం ఉందని ఆర్‌డీఓ శ్రీలేఖ అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే డీఆర్వో అవినీతిపై ఆమె కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. అంతకు ముందు అంటే ఎనిమిది నెలల క్రితం కూడా తనను డీఆర్‌ఓ వేధిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్టు సమాచారం.

డిగ్రీ కళాశాలలో విజిలెన్స్ వారోత్సవాలు

భీమునిపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పారదర్శకత, నిజాయతీపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంపొందించుకోవాలని భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ సూచించారు. బుధవారం ఆ కళాశాలలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటా అక్టోబరు నెలలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మేనేజర్ సీహెచ్‌వీ చౌదరి విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

డిజిటల్ బోధనతో మెరుగైన ఫలితాలు : డీఈఓ


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

భీమునిపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను డీఈఓ ఎన్. ప్రేమ్‌కుమార్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పలు అంశాలపై మాట్లాడారు. డిజిటల్ తరగతుల్లో బోధన బాగుందని, విద్యాభివృద్ధిలో ఎంతో మెరుగుదల కనిపిస్తుందని సంతోషం వ్యక్తం చేశారు. అభ్యసన సామగ్రి చాలా బాగుందని, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు శివరాణి, జయప్రద, హెచ్ఎం మధు కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

భీమునిపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమ శిక్షణతో చదివినప్పుడే ఉన్నత స్థానాలకు చేరుకోగలరని సమగ్ర శిక్షాభియాన్ స్టేట్ కో ఆర్డినేటర్ ఎంఎస్ కరియప్ప అన్నారు. బుధవారం గొల్లలపాలెం కేజీబీవీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కిచెన్ రూమ్, కూరగాయలు, భోజన పదార్థాలను పరిశీలించారు. పాఠశాల సిబ్బందితో సమావేశమై విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీసీడీఓ శ్రీదేవి, ప్రిన్సిపాల్ గంగా కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వాల నమోదు

పద్మనాభం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ కరుణాకర్ కోరారు. ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదులో భాగంగా గురువారం ఆయన రెడ్డిపల్లి హైస్కూల్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సభ్యత్వాల సేకరణ ముమ్మరంగా చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాలాడ రామకృష్ణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బోని సూర్యనారాయణ, మండల నాయకులు ఆర్. రమేశ్, కె. గౌరినాయుడు, కె. రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుకు గడువు పెంపు

పద్మనాభం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఈ-పంట నమోదు గడువును ప్రభుత్వం ఈనెల 30వ తేదీ వరకు పొడిగించినట్టు ఏఓ ఎంవీ చలం తెలిపారు. బుధవారం ఆయన అనంతవరం గ్రామంలో వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా తమ పంటల సాగు వివరాలను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలన్నారు. ప్రస్తుతం వరి పంటకు ఆకు ఎండు తెగులు వ్యాప్తి చెందుతుందన్నారు.

తగరపువలస పీఏసీఎస్ చైర్మన్ వర్మకు సన్మానం

భీమునిపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస పీఏసీఎస్ చైర్మన్ పీజీకే వర్మను భీమిలి సీబీఎం, బీజీఎం పాఠశాలల యాజమాన్యాలు బుధవారం సత్కరించాయి. సీబీఎం ఎయిడెడ్ హైస్కూల్, బీజీఎం ఇంగ్లీష్ మీడియం స్కూల్ చైర్మన్‌గా వర్మ వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సీబీఎం హైస్కూల్ కరస్పాండెంట్ విజయకుమారి, బీజీఎం స్కూల్ కరస్పాండెంట్ చంద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, ప్రముఖ సీనియరు న్యాయవాది సుందర్‌సింగ్, ఎన్‌జీవో అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కె. ముత్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో శివాలయానికి షెడ్ నిర్మాణం

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసంలో శివాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అమనాం గ్రామంలో మాజీ సర్పంచ్ డీఎస్ సత్యనారాయణ రాజు సొంత నిధులతో షెడ్ నిర్మించారు. బుధవారం ఆయన షెడ్‌ను ప్రారంభించారు.

వైసీపీ 'కోటి సంతకాల సేకరణ'

పద్మనాభం, భీమునిపట్నం అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం వైద్యాన్ని ప్రైవే టుపరం చేయడానికి ప్రయత్నిస్తోందని వైసీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను) అన్నారు. బుధవారం ఆయన అయినాడ గ్రామంలో జరిగిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు కె. లక్ష్మణరావు, ఎంపీపీ కె. రాంబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్. గిరిబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పులిరాజు, నాయకులు ఎం. శివరామకృష్ణ, పాపారావు, ఆదిబాబు, బంగారప్పడు, ఈశ్వరరావు, మజ్జి వెంకటరావు, పద్దు పాల్గొన్నారు. అలాగే భీమునిపట్నం పట్టణంలోని పాత బస్టాండ్‌లో కూడా వైసీపీ నాయకులు కోటి సంతకాల సేకరణ చేపట్టారు. నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించిన ఈ కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర, 3వ వార్డు ఇన్‌చార్జి మైలపల్లి షణ్ముఖరావు, వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నరసింగరావు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, నాయకులు కదిరి ఎల్లాజి, మైలపల్లి లక్ష్మణరావు, పాసి స్వర్ణలత పాల్గొన్నారు.


నిత్యాన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

లక్ష్మీపురంలో నిత్యాన్నదానం

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీపురం అయ్యప్ప సేవా పీఠంలో నిత్యాన్నదాన (నారాయణ సేవ) కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. 41 రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు తాటితూరు గ్రామానికి చెందిన కనకల అప్పలరాజు, హేమంత్‌నాయుడు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముందు గణపతి సహిత శ్రీమహాలక్ష్మి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో పీఠం ధర్మకర్త తాతినాయుడు, జడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడు పాల్గొన్నారు.

కొమ్మాది : పీఎంపాలెం పరిధిలోని లక్ష్మీవానిపాలెం గ్రామంలో పరశురామ్ గురుస్వామి ఆధ్వర్యంలో మాలధారణ చేసిన స్వాములకు బుధవారం నుంచి నారాయణ సేవ ప్రారంభించారు.ఈ కార్యక్రమాన్ని మాలధారణ చేసిన భక్తులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

భీమునిపట్నం : బీచ్ రోడ్‌లో ఉన్న అయ్యప్ప ధ్యాన మందిరం వద్ద కూడా మాలలు వేసిన వారికి అన్న ప్రసాద వితరణ ప్రారంభించారు. డిసెంబరు 5వ తేదీ వరకూ అన్నప్రసాద వితరణ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, మాజీ ఎంపీపీ యరబాల కృష్ణవేణి, నాయకులు ముత్తంశెట్టి మహేశ్, గాడు అప్పలనాయుడు, మైలపల్లి షణ్ముఖరావు, గొలగాని నరేంద్రకుమార్, గాడు సన్యాసినాయుడు, నిర్వాహకులు భీమిలి వీరాంజనేయ అయ్యప్పస్వామి సేవా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మినేని ఎర్రునాయుడు, మొకర నరసింగరావు, ఆదిమూలం నాగరాజు పాల్గొన్నారు.

...అయితే ఓకే

... 5వ పేజీ తరువాయి

వినిపిస్తున్నాయి. అలాగే గిరి ప్రదక్షిణ సందర్భంగా 120 లీటర్లు సామర్థ్యం కలిగిన 570 ప్లాస్టిక్ డ్రమ్ములను రూ.1,200 చొప్పున, 200 లీటర్లు సామర్థ్యం కలిగిన వంద డ్రమ్ములను రూ.రెండు వేల చొప్పున కాంట్రాక్టర్ కొనుగోలు చేశారంటూ బిల్లు చెల్లింపు అంశాన్ని అజెండాలో ప్రతిపాదించగా కమిటీ సభ్యురాలు సాడి పద్మారెడ్డి అభ్యంతరం తెలిపారు. తనకు డ్రమ్ముల వ్యాపారంలో అనుభవం ఉందని, డ్రమ్ములను అద్దెకు తీసుకుంటే ఒక్కో దానికి రూ.50 నుంచి రూ. వంద ఖర్చు అవుతుందని, అలాంటిది ఏకంగా రూ.రెండు వేలు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఒకవేళ కొనాలనుకున్నా 120 లీటర్ల డ్రమ్ములను రూ.700కి, 200 లీటర్ల డ్రమ్ములను రూ.800కి సరఫరా చేసేవారున్నారని చెప్పారు. అంత మొత్తం ఖర్చు పెట్టి కొనుగోలు చేసిన 670 డ్రమ్ములు ఇప్పుడు ఎక్కడున్నాయని ఆమె ప్రశ్నించారు. ఇదంతా అడ్డగోలు దోపిడీయేనని, ఆ అంశాన్ని తిరస్కరించాలని మేయర్‌ను కోరారు. దీంతో ఆ అంశాన్ని వాయిదా వేస్తున్నట్టు మేయర్ ప్రకటించారు. కొంతసేపటి తర్వాత ఆయా అంశాలపై సంబంధిత అధికారి వివరణ ఇస్తానని కోరగా, సభ్యులు సరేనని అనుమతించడంతోపాటు డ్రమ్ముల ఫొటోలు చూపించాలనే షరతుపెట్టి ఆమోదం చేస్తున్నట్టు ప్రకటించడం ఆశ్చర్యం కలిగించింది. జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి అంశానికి ఆమోదం తెలిపే వ్యవహారంలో కూడా మేయర్ పేషీలోని ఒక ప్రైవేటు వ్యక్తి రూ.పది వేలు చొప్పున వసూలు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్ని అంశాలను గుడ్డిగా ఆమోదించడంలో ఆంతర్యమేమిటని స్టాండింగ్ కమిటీలోని ఒక సభ్యుడిని ప్రశ్నించగా...మేయర్ పేషీలోని ఒక ప్రైవేటు వ్యక్తి ఒత్తిడి చేయడంతోనే తాము నోరెత్తలేకపోతున్నామని వాపోయారు.

మరింత సమర్థంగా ఆహార భద్రతా విభాగం

... 5వ పేజీ తరువాయి

రావడంతో సమీక్షించాం. ఆహారంలో రంగుల వినియోగంపై ప్రజలను అప్రమత్తం చేయాలని విభాగాన్ని ఆదేశించాం' అని రఘురామ పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఫిర్యాదుల కమిటీ సభ్యులు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పి.విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆహార భద్రతా విభాగం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందాలి

... 5వ పేజీ తరువాయి

అధికారులను ఆదేశించింది. ఈ క్రమంలో కేజీహెచ్‌లో హీమోఫీలియా వ్యాధిగ్రస్తులకు అందుతున్న సేవలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు చేపడు తున్న చర్యలు, ఎన్టీఆర్ వైద్య సేవలపై కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కమిటీ సభ్యులు పలు సూచనలిచ్చారు. హీమోఫీలియాతో వస్తున్న వారికి తక్షణ సాయం అందించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రూ.48 వేలకు తగిన మందులు ఇవ్వాలన్నారు. డే కేర్ కేటగిరీలో వైద్య సేవలు అందించాలని కమిటీ చైర్మన్ సూచించారు. అంగవైకల్యం ధ్రువపత్రాలు అందించేందుకు ఉన్నతస్థాయిలో చర్చించి చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖ డిప్యూటీ సెక్రటరీ శోభికను చైర్మన్ ఆదేశించారు. అనకాపల్లి జిల్లాలో 53 కేసులున్నాయని, వారికి వైద్య సేవలు అందుతున్నాయని సంబంధిత అధికారులు వివరించారు. అనంతరం ఫుడ్ సేఫ్టీ విభాగంలో జరుగుతున్న కార్యకలాపాలు, చేపడుతున్న చర్యలపై కమిటీ సమీక్షించింది. స్టార్ హోటల్ మొదలుకొని వీధుల్లోని చిన్న హోటళ్ల వరకు ఆహారం కల్తీ జరుగుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు అప్రమత్తంగా ఉంటే ప్రజారోగ్యానికి భరోసా లభిస్తుందని డిప్యూటీ స్పీకర్ అన్నారు. ఇటీవల కురుపాం వసతిగృహంలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా విస్తృత తనిఖీలు, పరీక్షలు నిర్వహించాలన్నారు. ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో కలర్స్ వాడకుండా చర్యలు తీసుకోవాలని, చికెన్, మటన్ తనిఖీలు చేపట్టాలన్నారు. సిబ్బంది కొరత గురించి ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రస్తావించగా సచివాలయాల్లో విద్యార్హతలున్న వారిని వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలను ప్రభుత్వానికి నివేదిస్తామని, సకాలంలో ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. మూడు నెలలకొకసారి విశాఖ వేదికగా సమావేశం నిర్వహిస్తామని చైర్మన్ తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, కొణతాల రామకృష్ణ, కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, శాసనసభ డిప్యూటీ సెక్రటరీ కె.రాజాకుమార్, అధికారులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రయోజనం కోసమే గూగుల్‌పై అసత్య ప్రచారం

... 5వ పేజీ తరువాయి

తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. స్వప్రయోజనాలు, స్వలాభాల కోసం ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. విపక్షాలు నిర్మాణాత్మక పాత్ర పోషించాలని, వీలైతే ప్రజలకు అవగాహన కల్పించాలి తప్ప రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుదోవ పట్టించకూడదన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి సమపాళ్లలో ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకువెళుతుందన్నారు. పార్టీ నాయకులంతా పరిశ్రమల ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలకు ప్రజలకు వివరించాలన్నారు.

వైఎస్ హయాంలో బ్రాండిక్స్‌కు ఎకరా రూపాయికే ఇచ్చారు



అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

గూగుల్ రాకతో విశాఖకు మరికొన్ని కంపెనీలు వస్తాయని అనకాపల్లి శాసనసభ్యుడు కొణతాల రామకృష్ణ అన్నారు. బుధవారం శాసనసభా ఫిర్యాదుల కమిటీ సమీక్షకు హాజరైన ఆయన అనంతరం కలిసి విలేకరులతో మాట్లాడుతూ అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ, విశాఖలో టీసీఎస్, మరికొన్ని కంపెనీల ఏర్పాటుతో రాష్ట్రంలో ఐటీ రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. విశాఖలో టీసీఎస్‌కు ఎకరా 99 పైసలకే ఇచ్చారని తప్పుబడుతున్నారని, రాజశేఖర్‌రెడ్డి హయాంలో అచ్యుతాపురంలో బ్రాండిక్స్ కంపెనీకి ఎకరా రూపాయికే ఇచ్చారని కొణతాల గుర్తుచేశారు.

శివాలయాల వద్ద కార్తీక సందడి



కొత్త వెంకోజీపాలెంలోని ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయం

వెంకోజిపాలెం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం పూజలకు శివాలయాలన్నీ సిద్ధమయ్యాయి. ఇప్పటికే ఆలయాలకు రంగులు అద్దారు. దేవస్థానం, ప్రైవేటు నిర్వాహకుల ఆధ్వర్యంలో శివాలయాల్లో కార్తీకమాసం పూజలు, వివిధ కార్యక్రమాల నిర్వహణకు అలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అధిక సంఖ్యలో విచ్చేసే భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా నిర్వాహకులు విశేష ఏర్పాట్లు చేపడుతున్నారు.

కొత్త వెంకోజిపాలెంలోని శ్రీరామానంద ఆశ్రమం దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలోని శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వర ఆలయంలో బుధవారం నుంచి నవంబరు 21 వరకు కార్తీకమాస పూజలు నిర్వహించనున్నట్టు ఆలయం కార్యనిర్వాహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. 22న ఉదయం 10 గంటలకు మంగళధ్వనితో ప్రారంభమై అఖండ దీపారాధన, విఘ్నేశ్వర పూజ, పంచ పల్లవ సహిత పంచామృత నారికేళ అభిషేకాలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం 6.30 గంటలకు ఆకాశ జ్యోతి ప్రజ్వలన ధ్వజస్థంభ శిఖరాగ్ర భాగంలో ప్రారంభం జరుగుతుందని చెప్పారు. . నెల రోజుల పాటు ఆలయ ప్రధానార్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో ల అర్చకులు భక్తులకు ఆలయ సముదాయంలోని శివాలయం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వినాయక, రాజరాజేశ్వరి, ఆంజనేయస్వామి, అయ్యప్ప దేవాలయం తదితర ఆలయాల్లో విశేష అభిషేకాలు నిర్వహించనున్నారు.

ఈ నెల 25న నాగుల చవితి వేడుకలు ఆలయ వద్ద నున్న పుట్టలో పూజలు, 26న నాగపంచమి పూజలను సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న నాగేంద్రుడి వద్ద జరుపనున్నట్టు అర్చకులు పేర్కొన్నారు. ఈ నెలలో ప్రతి రోజూ ఆలయానికి రావడం వీలుకాని భక్తులకు ప్రత్యేక టిక్కెటు సదుపాయం కల్పించినట్టు చెప్పారు. ఈ కార్తీక మాస పూజలకు స్థానిక గ్రామ సేవా సంఘం కార్యవర్గ సభ్యులు, గ్రామస్థులు తమ సహాయ సహకారాలు అందించనున్నట్టు తెలియజేశారు. అలాగే హెచ్‌బీ కాలనీ, కేఆర్‌ఎం కాలనీ, ఇసుకతోట శివాలయాల్లో, ఎంఎంటీసీ కాలనీ త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ కార్తీక మాసోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు.

» నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు సన్నాహాలు
» భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

ఆరిలోవలో..

ఆరిలోవ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ ప్రాంతంలో గల అన్న శివాలయాల్లో కార్తీక శోభ సంతరించుకున్నాయి. ఈ నెల నుంచి శివాలయాల్లో కార్తీకమాస ప్రత్యేక పూజలు, ఆవరణలో ఆధ్యాత్మిక, భక్తి కార్యక్రమాలను విరివిగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. డ్రైవర్ కాలనీలో వెలసిన బాల త్రిపుర సుందరీ సహిత మల్లేశ్వర స్వామి ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. బుధవారం వేకువ జామున నాలుగు గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త కృష్ణంరాజు తెలిపారు. తొలుత శివుడికి వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య పవిత్ర



పూజలకు సిద్ధమైన కొత్తవెంకోజీపాలెం శివాలయం

గంగాజలాలతో అభిషేకాలు చేస్తారని తెలిపారు.. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.

పెదవాల్తేర్‌లో..

పెదవాల్తేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పెదవాల్తేరులోని శ్రీకాశీవిశ్వేశ్వర ఆలయంలో కార్తీక మాస ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఆలయ చైర్మన్ సీహెచ్ జ్యోతి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయ పరసరాలను పరిశుభ్రం చేయించారు. ఆలయాన్ని రంగులు, విద్యుత్ దీపాలతో శోబాయమానంగా అలంకరించి ముస్తాబు చేశారు. ఈ నెల 27న కార్తీక మాసం తొలి సోమవారం కావడంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. కార్తీక మాస



ఆరిలోవ : విద్యుద్దీపాలతో అలంకరించిన డ్రైవర్స్ కాలనీలోని శివాలయం

ప్రత్యేక పూజలు, అభి షేకాలు నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ సీహెచ్ జ్యోతి తెలిపారు.

అలాగే.. లాసన్స్ బే కాలనీలోని శ్రీఅసంఘానందాశ్రమం, శ్రీమృత్యుంజయ స్వరాలయాలను రంగులతో ముస్తాబు చేశారు. ఆశ్రమ అధ్యక్షుడు, శ్రీవిష్ణు సేవానందగిరి స్వామి ఆశీస్సులతో ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి, కాగితాల సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో కార్తీక మాసంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.ఈ ఆలయంలో భక్తులే స్వయంగా అభిషేకం చేసుకునే వీలు ఉండడం ఒక విశేషం.భక్తులు నుంచి ఎటువంటి రుసుం తీసుకోకుండా సేవాభావంతో ప్రతి ఒక్కరికీ భగవంతుని దర్శించుకొని అభిషేకించుకునే ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తలు చేశారు.



పెదవాల్తేర్ : రంగులు వేసిన లాసన్స్ బే కాలనీలోని శ్రీఅసంఘానందాశ్రమం శ్రీమృత్యుంజయ స్వరాలయం

ఎక్కడికక్కడే పైపులైన్ల లీకేజీ

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ స్థానికుల ఆరోపణ

పెదవాల్తేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 19వ వార్డు పెదజాలారిపేట మెయిన్ రోడ్, ఆదర్శ గ్రామంలో కొళాయి పైపులైన్లకు లీకులు పడి తాగు నీరు వృథాగా పోతోంది. గత కొన్ని రోజులుగా లీకేజీలతో ఈ విధంగా తాగునీరు రహదారిపై ప్రవహిస్తోందని, దీంతో కొళాయిల్లో నీటి ధార తగ్గిపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజులుగా



పెదజాలరిపేటలో...



ఆదర్శ గ్రామంలో వృథాగా అవుతున్న నీరు

ఈ సమస్య ఉండగా.. ఫిర్యాదు చేసినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనిపై నీటి సరఫరా విభాగంనకు ఫిర్యాదు చేస్తే వర్కర్లు వచ్చి పైపులైన్లు మరమ్మతులు చేస్తున్న కొన్ని రోజుల తర్వాత మళ్లీ పైపులైన్లు లీక్ అవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఆధికారులు పైపు లైన్లు శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని సాన్థికులు కోరుతున్నారు.

కార్తీక మాసోత్సవాలు ప్రారంభం

వెంకోజీపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెంలోని జ్ఞానానంద ఆశ్రమం, దేవదాయ శాఖ ఆధీనంలోని శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో కార్తీక మాసోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవస్థానం ఈవో బండా ప్రసాద్, సభ్యులు, గ్రామ సేవా సంఘం కార్యవర్గం, సభ్యులు స్థానిక భక్తులతో కలిసి అఖండ జ్యోతిని వెలిగించి, కార్తీకమాసోత్సవాలు ప్రారంభించారు. భక్తులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని ద్వజస్థంభం వద్ద ఆకాశజ్యోతిని గ్రామ సేవా సంఘం సభ్యులు ప్రారంభించారు. నెల రోజుల పాటు ప్రతీ రోజు ఉదయం పూజలు, సాయంత్రం ఆకాశజ్యోతిని వెలిగించనున్నట్టు అర్చకులు పేర్కొన్నారు. వచ్చే నెల 5న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఆ రోజు సాయంత్రం ఆలయ ప్రాంగణంలో జ్వాలాతోరణం నిర్వహించనున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సిబ్బంది, గ్రామసేవా సంఘం కార్యవర్గ ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు. అలాగే ఇసుకతోట, హెచ్‌బీ కాలనీ, కేఆర్‌ఎం కాలనీలలోని శివాలయాల్లో కార్తీక మాసోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఎంఎంటీసీ కాలనీలో త్రిమూర్తిక వెంకటేశ్వరస్వామి ఆలయం, కొత్త వెంకోజీపాలెంలోని వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయం, పాత వెంకోజీపాలెం శ్రీసీతారామాలయాల్లోనూ ఉన్న ధ్వజస్థంభాల వద్ద ఆకాశజ్యోతిలను వెలిగించారు.



ధ్వజస్థంభం వద్ద ఆకాశ జ్యోతి వెలిగిస్తున్న భక్తులు

సినిమా గైడ్

- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శరత్, శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య, ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజీ** కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి**: సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 17, టమాటా 25, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలు పు) 46, బెండకాయలు 36, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 22, క్యారెట్ 52, దొండకాయలు 38, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 68, అల్లం (పాత ది) 70, బరబాటి 38, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 66, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 22, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడ దుంపలు 36, కంద 48, దేముడు చిక్కుడు 76, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 22, మామిడి అల్లం 90, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు	
బ్రాయిలర్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

క్రమశిక్షణాయుత విద్య అలవరచుకోవాలి

» డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు సూచించారు. కళాశాలలో బుధవారం నూతన విద్యార్థుల ఏ విధంగా నడుచుకోవాలో అవగాహన కల్పిస్తూ దీక్షారంబ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల నియమ నిబంధనలకు అనుగుణంగా విద్యార్థులు మెలగాలన్నారు. తరగవులకు డుమ్మా కొట్టకుండా ప్రతీ పాఠ్యంశం శ్రద్ధతో అభ్యసించి మంచి మార్కులు సాధించాలన్నారు. కళాశాలలో ఎన్నో మెరుగైన సదుపాయాలు, నైపుణ్యాలు పెంచుకునే టెక్నాలజీ ఉందని, అవకాశాలను అందిపుచ్చుకుని మంచి భవిష్యత్తుకు మార్గం వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అకడమిక్ కో-ఆర్డినేటర్ రాజేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంత నిర్లక్ష్యమా?

» పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించిన సిబ్బంది
» పట్టించుకోని జీవీఎంసీ అధికారులు
» పలు ప్రాంతాల్లో చెత్తకుప్పలు
» కాలువల్లో నెలల తరబడి తొలగించని పూడికలు
» దుర్గంధం, దోమలతో ప్రజల అవస్థలు
» జ్వరాల పాలవుతున్న జనం

పెదవాల్తేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 19వ వార్డు పెదజాలారిపేట చేపల మార్కెట్ వద్ద గల డ్రైనేజీలు చెత్తకుప్పలతో నిండిపోయాయి. దీంతో ఈ ప్రాంతంలో పగలూ రాత్రి తేడా లేకుండా దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది జ్వరాల సీజన్ కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ కాలువలపై స్థానికులు పనికిరాని వస్తువులు, చిన్న బడ్డీలు, చెత్తాచెదారం వేస్తుండడంతో జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది అందులోని వ్యర్థాలను తీయలేని పరిస్థితి నెలకొంది. దీంతో నెలల తరబడి కాలువల్లో చెత్తాచెదారాలు పేరుకుపోయి దుర్గంధం వ్యాప్తిస్తోంది. దీనివల్ల స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. కాలువలో మురుగు నీరు ప్రవహించే అవకాశం లేకుండాపోతోంది. ఫలితంగా ఎక్కడపడితే అక్కడ కాలువలు బ్లాక్ అయిపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అంతేకాకుండా స్థానికులు రోడ్లు మీద వ్యర్థాలు వేయడంతో పెంటకుప్పలను తలపిస్తోందని, దీంతో ఆ ప్రాంతం అంతా దుర్వాసన వెదజల్లడంతో అటు వైపు ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోందని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా జీవిఎంసీ అధికారులు స్పందించి తక్షణమే సమస్యను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





పెదజాలరిపేటలో కాలువలపై వేసిన పనికి రాని సామగ్రి, వీధుల్లో చెత్తాచెదారం

డాక్టర్ అంబేడ్కర్ గురుకులం సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ప్రధాన కార్యదర్శి

ఆరిలోవ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారం సమీపంలోని శ్రీకృష్ణాపురంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి.సన్యాసినాయుడు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. డార్మేటర్, వంటగదిని పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం ఆయన పాఠశాలలో గల ఆర్ట్ గ్యాలరీని సందర్శించారు. విద్యార్థులు వేసిన పలు చిత్రాలను చూసి ఆనందం వ్యక్తం చేశారు. చిన్నారుల ప్రతిభ అమోఘమంటూ ప్రశంసలు కురిపించారు. ముఖ్యంగా స్టిక్స్‌తో రూపొందించిన తాజ్‌మహల్ చిత్రంతో పాటు ఆరో తరగతి విద్యార్థి రామ్‌ప్రసాద్ స్టిక్స్‌తో రూపొందించిన ల్యాండ్ స్కేపింగ్ ఆర్ట్, మరికొన్ని చిత్రాలను చూసి అభినందించారు. ప్రశంసా పత్రాన్ని అందజేశారు. విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందిస్తున్నారంటూ డ్రాయింగ్ మాస్టర్ సుధాకర్‌ను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయ కర్త గ్రేసీ, ప్రిన్సిపాల్ రత్నవల్లి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు వేసిన పెయింటింగ్స్, స్టిక్ వర్క్, ఆర్ట్‌ను పరిశీలిస్తున్న జస్టిస్ సన్యాసినాయుడు

సఖీ సురక్ష.. మహిళల పాలిట సంజీవని

» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఆరిలోవ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం అమలు చేస్తున్న సఖీ సురక్ష పథకం సంజీవని వంటిదని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. గ్రేటర్ విశాఖ 13వ వార్డులోని జీవీఎంసీ కల్యాణ మండపంలో మెప్మా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సఖీ సురక్ష కార్యక్రమాన్ని కార్పొరేటర్ కెల్ల సునీతతో కలిసి ఎమ్మెల్యే వెలగపూడి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సఖీ సురక్ష ద్వారా మహిళా ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందన్నారు. కాట్టి ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి మహిళా వినియోగించుకోవాలని సూచించారు. సుమారు 300 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీడీఈవో శ్రీరామ్, సీవో అప్పలకొండ, టీడీపీ 13వ వార్డు అధ్యక్షుడు పి.ధర్మారావు, 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, పార్లమెంటరీ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

మాదిన ప్రసాదరావుకు రైతు నేస్తం పురస్కారం

» 26న హైదరాబాద్‌లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ప్రదానం



మద్దిలపాలెం/ ఆరిలోవ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పద్మశ్రీ ఐవీ సుబ్బారావు రైతు నేస్తం పురస్కారాన్ని డాక్టర్ మాదిన ప్రసాదరావుకు ప్రదానం చేస్తున్నట్టు రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఈనెల 26న నిర్వహించే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పాల్గొంటారని చెప్పారు. విశాఖ పశుసంవర్ధక శాఖ సహాయసంచాలకుడుగా పని చేస్తున్న మాదిన ప్రసాదరావు రైతులకు అవగాహన కల్పించే ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. పాడి, కోళ్ల మొదలైన రంగాల్లో ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు ఎంతోమందికి శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. 31 సంవత్సరాలుగా మూగ జీవాలకు సేవలందించడంవంటి అంశాలు పరిగణనలోకి తీసుకుని ఆయనకు రైతు నేస్తం పురస్కారం అందిస్తున్నట్టు పేర్కొన్నారు. రైతునేస్తం పురస్కారానికి ప్రసాదరావు ఎంపిక కావడంపై రాష్ట్ర పశుసంవర్ధక డైరెక్టర్ దామోదర్‌నాయుడు, అదనపు డైరెక్టర్ ఎండ సింహాచలం, జిల్లా జాయింట్ డైరెక్టర్ శంకరరావు, ఉప సంచాలకులు చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు.


జీతాల పెంపు కోరుతూ అద్దె బస్సు డ్రైవర్ల ఆందోళన



సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తున్న అద్దె బస్సుల డ్రైవర్లు

మద్దిలపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో పని చేస్తున్న అద్దె బస్సుల డ్రైవర్ల జీతాలు పెంచాలని సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు డిమాండ్ చేశారు. మద్దిలపాలెం ఆర్టీసీ డిపో వద్ద బుధవారం అద్దె బస్సుల డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న వెంకటరావు మాట్లాడుతూ అగ్రిమెంట్ కాలం ముగిసి ఏడాదైన అద్దె బస్సు డ్రైవర్ల జీతాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. డ్రైవర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చే వరకు ఉద్యమిస్తామన్నారు. జీతంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, నైట్ హాల్ట్ అలవెన్స్, ఇన్సూరెన్స్, జిల్లా పాస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డ్రైవర్ల సమస్యలపై అయిదు రోజుల నుంచి సమ్మె చేస్తున్నా, ఇప్పటి వరకూ అద్దె బస్సుల యజమానులు చర్చలకు రాలేదన్నారు. అవుట్ సోర్సింగ్ డ్రైవర్లకు 8 గంటల పనికి రూ.వెయ్యి చెల్లిస్తున్నారని, డ్యూటీ చేస్తున్న డ్రైవర్లకు 8 గంటలకు రూ.600 చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.కుమారి, డ్రైవర్లు పాల్గొన్నారు.

సంప్రదాయానికి ప్రతీక వస్త్రధారణ



వివిధ రాష్ట్రాల సంప్రదాయ వస్త్రధారణతో అలరించిన విశాఖ వేలీ స్కూలు విద్యార్థులు

ఆరిలోవ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మనం ధరించే వివిధ రకాల దుస్తులు మన సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని దేవదాయ శాఖ విశ్రాంత కమిషనర్ వైవీ అనూరాధ అన్నారు. బుధవారం విశాఖ వేలీ స్కూలులో నిర్వహించిన హెరిటేజ్ బ్యాడ్జెస్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అనూరాధ మాట్లాడుతూ మన సంస్కృతిని అవగాహన పెంపొందించుకొని, మన పెద్దలు చూపించిన మార్గంలో నడవాలని సూచించ్చారు. విద్యార్థుల్లో మన వారసత్వ అంశాలపై అవగాహన కల్పించేందుకు హెరిటేజ్ క్లబ్ ప్రారంభించడం మంచి పరిణామమన్నారు. ధర్మానికి కట్టుబడి ఉంటే విజయం వరిస్తుందన్నారు. మన ఆచారాలు, సంప్రదాయాలు, పండుగల గురించి తెలుసుకోవడం, గౌరవించడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా.. విద్యార్థులు మనదేశంలో గల 29 రాష్ట్రాల సంప్రదాయ దుస్తులు ధరించి ఆకట్టుకున్నారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఇటువంటి కార్యక్రమాలను మరిన్ని చేపట్టాలని ప్రిన్సిపాల్‌ను అనూరాధ సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరీప్రభాకర్, సీఏ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో దుకాణాల కేటాయింపు

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతుబజార్లలో ఖాళీగా ఉన్న 120 దుకాణాలకు కలెక్టరేట్‌లో బుధవారం లాటరీ తీసి రైతులకు కేటాయించారు. రైతుల సమక్షంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ డ్రా నిర్వహించారు. కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించారని రైతులు సంతోషం వ్యక్తంచేశారు.



డ్రా తీసి దుకాణాలు కేటాయిస్తున్న జేసీ మయూర్ అశోక్. పక్కన ఇతర అధికారులు


ద్వారకా బస్సు కాంప్లెక్స్‌లో బస్సుల చుట్టూ జనసందోహం


ఆర్టీసీ కాంప్లెక్స్ లోపల ఖాళీ లేక రన్‌వేపై నిరీక్షిస్తున్న ప్రయాణికులు, విద్యార్థులు

ఆర్టీసీ ప్రయాణ కష్టాలు ఇన్నన్ని కాదయా..!

మహారాణిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారులు నిత్యం సంచరించే ద్వారకా ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్‌లో ప్రయాణికులు ప్రమాదకర రీతిలో బస్సుల కోసం పరుగులు తీస్తున్నా కట్టడి చేసే నాథుడు లేడు. పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి బస్సులు వచ్చి ఆగే రన్‌వే మీదకే ఆత్రంగా ప్రయాణికులు వచ్చేస్తున్నారు దీనితో ఎప్పుడు, ఎవరికి ప్రమాదం సంభవిస్తుందోనని ఆర్టీసీ అధికారులు హైరానా పడుతున్నారు. ఆర్టీసీ ద్వారకా బస్సు కాంప్లెక్స్ లో నెల రోజులుగా ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రకటించటంతో ఇప్పుడు ప్రతీ ఒక్క మహిళ ఉచితంగా ప్రయాణించేందకు ఇష్టపడుతున్నారు. దారిలో బస్సులు ఆపకపోవడం, ఆపినా సీట్లు దొరక్కపోవడంతో ద్వారకా బస్సు కాంప్లెక్స్‌కు వచ్చి గమ్యానికి వెళ్లాల్సిన బస్సు కోసం పరుగులు తీస్తున్నారు. ఈ కారణంగా కాంప్లెక్స్ లోపల ప్లాట్‌ఫాంలు కిక్కిరిసిపోతున్నాయి. అక్కడ స్థలం చాలక బస్సులు రన్ వే మీదకు వచ్చే చోటుకు ప్రయాణికులు ఎగబడుతున్నారు. దూర ప్రయాణాలు చేయాల్సినవారు బస్సులోకి ప్రవేశించడానికి చాలా కష్టపడవలసి వస్తుంది. సాయంత్రం వేళల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. రోజూ వచ్చిపోయే విద్యార్థులు, ఉద్యోగ వర్గాలవారు, వివిధ అవసరాల నిమిత్తం నగరానికి వచ్చే వారు ఇళ్లకు తిరిగి చేరుకునేందుకు కాంప్లెక్స్‌కు వస్తున్నారు. కాంప్లెక్స్ పరిసరాల్లో ఎక్కువ విద్యాసంస్థలు ఉండడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు రావడంతో ఆ ప్రాంతం బహిరంగ సభను తలపిస్తోంది. అసలే జనసందోహం. దీనికితోడు బస్సు ప్లాట్‌ఫామ్‌లో ఆగకముందే ప్రయాణికులు సీట్ల కోసం రన్‌వే మీదకు వచ్చేస్తుండడంతో ఎక్కడ ప్రమాదాలు సంభవిస్తాయోనని కొందరు అధికారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆర్టీసీ సిబ్బంది రన్‌వేపైకి చేరుకొని ప్రయాణికులు, విద్యార్థులను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నా ఎలాంటి ఉపయోగం ఉండటం లేదు. ప్రయాణికులు ఇళ్లకు త్వరగా చేరుకోవాలనే ఆత్రుతలో బస్సు ఎక్కేటప్పుడు తీవ్ర రద్దీ, గలాటాలు జరుగుతున్నాయి. పరిస్థితి చేయి దాటకముందే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కార్తీక పూజలు ప్రారంభం


రెడ్డికంచరపాలెంలో శివుడికి పూజలు

కంచరపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా బుధవారం కంచరపాలెం పరిసర ప్రాంతాల్లోని శైవాలయాల్లో పూజలు ప్రారంభమయ్యాయి. తిక్కవానిపాలెం, గంగన్న నగర్, రెడ్డి కంచరపాలెం, గొల్ల కంచరపాలెం, తుమ్మడిపాలెం, ఐటీఐ జంక్షన్ తదితర ప్రాంతాల్లో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, విశిష్ట అలంకరణ జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కంచరపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈపీడీసీఎల్ కంచరపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు రెండోజోన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఆశవానిపాలెం, చాకలిగెడ్డ, లోకోషెడ్ తదితర ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

సీతమ్మధార పరిధిలో...

సీతమ్మధార: హెచ్‌టీ లైన్ల నిర్వహణ పనులు చేపడుతున్న నేపథ్యంలో గురువారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సీతమ్మధారలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయం, పి అండ్ టి కాలనీ, డాక్టర్ గణేష్‌బాబు ఆసుపత్రి ప్రాంతం, టీపీటీ కాలనీ, బాలయ్యశాస్త్రి లేఅవుట్, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ జోన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు మాధవధార పరిధిలో...

మాధవధార: మాధవధార ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్‌లో ఈ నెల 24న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ బీకె. నాయుడు తెలిపారు. సెక్షన్ పరిధిలోని రహదారులను ఆనుకొని విద్యుత్ హైటెన్షన్ తీగెల్ని తాకే చెట్ల కొమ్మల కొట్టివేత పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు. ఈ కారణంగా మాధవధార, గాంధీనగర్, అంబేడ్కర్ నగర్ సహా మర్రిపాలెం రైతుబజార్, ఎన్ఏడీ కొత్త రోడ్డు, సాకేతపురం ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

25న 'మట్టిమనిషి' నాటక ప్రదర్శన

డాబాగార్డెన్స్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రచయిత్రి డా.వాసిరెడ్డి సీతాదేవి రచనల్లో తలమానికంగా నిలిచిన 'మట్టిమనిషి' నాటక ప్రదర్శనను అభ్యుదయ రచయితల సంఘం, మార్క్సిస్టు అధ్యయన కేంద్రం విశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25న ప్రదర్శించనున్నట్టు అరసం ప్రధాన కార్యదర్శి యు.అప్పలరాజు తెలిపారు. నాటక ప్రదర్శన పోస్టర్‌ను బుధవారం పి.నాగమల్లేశ్వరరావు, బుసుపోతన, శ్యామ్‌సుందర్ ఆవిష్కరించారన్నారు. 25న సాయంత్రం 5.45 గంటలకు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నాటక ప్రదర్శన ప్రారంభమవుతుందన్నారు. అభిమానులు, కళా సంస్థల ప్రతినిధులు, ఔత్సాహికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అక్రమ నిర్మాణం పరిశీలన

మాధవధార, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 51వవార్డు ఏకలవ్యకాలనీలో పాత ఇంటిని తిరిగి నిర్మిస్తున్న క్రమంలో దాదాపు 10 గజాలు ఆక్రమించి కడుతున్నారన్న ఫిర్యాదుపై తహసీల్దారు కార్యాలయ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ విభాగాలు అక్కడికి వెళ్లారు. తహసీల్దారు వి.రమేష్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్మాణదారుడికి స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు గ్రేడ్-1 వీఆర్వో నిర్మల తెలిపారు. ఇటీవల రెండు వర్గాలుగా విడిపోయిన కాలనీ వాసులు ఫిర్యాదులు చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం అక్రమ నిర్మాణాన్ని తొలగించడానికి వెళ్లిన వారిని సైతం ఓ వర్గం అడ్డుకున్నట్లు వీఆర్వో పేర్కొన్నారు. కాలనీ పూర్తిగా ఆక్రమిత ప్రాంతంగా ఉండటంతో ఎవరికీ పట్టాలు, రిజిస్ట్రేషన్ విధానాలు లేవు. కాలనీ వాసులే ఆధిపత్యం కోసం తగాదాలు పడుతున్నట్లు తహసీల్దారు కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాద వితరణ


అన్నప్రసాద వితరణ చేపడుతున్న ఎంపీ శ్రీభరత్

అక్కయ్యపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీపూర్ణ పుష్కల అయ్యప్ప సేవా ట్రస్ట్ వ్యవస్థాపకుడు, అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్ట్ చైర్మన్ పైలా ఆదిమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం శంకర మఠంలో భక్తులకు ఉచిత అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశాఖ ఎంపీ శ్రీభరత్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో 25 ఏళ్లగా అయ్యప్ప మాలధారణ రోజుల్లో భక్తులకు ఉచిత అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ చైర్మన్ ఆదిమోహన్‌రెడ్డి మాట్లాడుతూ జనవరి 1 వరకూ ప్రతి రోజు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శంకరమఠం అధ్యక్షుడు డాక్టర్ టీవీ రవిరాజు, కార్యదర్శి అచ్యుతరామయ్య, ఎం.కృష్ణయ్య, ఎస్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైర్లెస్ కాలనీలో...


వైర్లెస్ కాలనీలో డీఆర్ఎం లలిత్ బొహ్రా

జ్ఞానాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిహరాత్మజ అన్నదాన చారిటబుల్ ట్రస్ట్, కోదండరామ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైర్లెస్ కాలనీ కోదండ రామాలయంలో మాలధారణ భక్తులకు మండలకాల మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని డీఆర్ఎం లలిత్ బొహ్రా ప్రారంభించారు. డిసెంబరు 1 వరకు కొనసాగుతుందని ట్రస్ట్ అధ్యక్షుడు కంచుమూర్తి వెంకటరమణమూర్తి తెలిపారు. రోజూ 1500 మంది స్వాములకు ప్రసాద వితరణ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, ట్రస్ట్ వ్యవస్థాపకులు కడగల శ్రీను, కె.సుబ్రహ్మణ్యం, కె.శ్రీనివాస్, సభ్యులు కోరాడ అప్పారావు, రామకృష్ణారెడ్డి, వి.అవతార్ స్వామి పాల్గొన్నారు.

విద్యతోనే మెరుగైన జీవితం: సీపీ బాగ్చి


బాలబాలికలకు నూతన వస్త్రాలు అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి, డి.ఎస్.ఆనంద్ తదితరులు

డాబాగార్డెన్స్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే మెరుగైన జీవితం, సమాజంలో పేరు ప్రఖ్యాతులు లభిస్తాయని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. డాబాగార్డెన్స్, సీతమ్మధారలోని పాపాహోమ్‌లలో ఆశ్రయం పొందుతున్న బాలబాలికలకు సూర్యాబాగ్‌లో బుధవారం నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. దాతలను అభినందించారు. ముఖ్య అతిథిగా హాజరైన మెరైన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ డి.ఎస్.ఆనంద్ అర్ధాంగితో కలిసి నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాపాహోమ్ కమిటీ సభ్యులు డి.సూర్యప్రకాశరావు, పంపాన వెంకటేశ్వరరావు, రమేష్ చంద్‌జైన్, ఇందిరా పట్నాయక్ పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీ నిర్మాణానికి వినతి


ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ శ్రావణి

అక్కయ్యపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డులో నూతన ప్రజారోగ్య కేంద్రాన్ని (యూపీహెచ్‌సీ) నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ ముక్కా శ్రావణి, టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్‌లు ఎంపీ శ్రీభరత్‌ను కోరారు. ఆయన క్యాంప్ కార్యాలయంలో ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. వార్డులోని కూరగాయల మార్కెట్ భవనంపైన మరో అంతస్తు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగాలకు 55 మంది ఎంపిక


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మంజుల

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం మినీ క్యాంపస్ డ్రైవ్ జరిగింది. జవహర్ నాలెడ్జ్ సెంటర్, నిర్మాణ్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో ఎక్స్‌టీ గ్లోబల్, టాటా ఎలక్ట్రానిక్స్, ప్రీమియర్ సంస్థలకు చెందిన ప్రతినిధులు విద్యార్థినులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కళాశాలలో తృతీయ సంవత్సరం పూర్తి చేసుకునే 105 మంది విద్యార్థినులు హాజరు కాగా 55 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ విద్యార్థినులు విద్యతోపాటు ఉపాధి నైపుణ్యాలు మెరుగుపరుచుకుని ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల జేకేసీ కో-ఆర్డినేటర్ ఎం.విద్యాకల్పన, వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, డాక్టర్ టీఎంఎ నివేదిత, డాక్టర్ ఆర్.కిరణ్మయి, ప్రైవేటు సంస్థల ప్రతినిధులు మహేష్, వేణుగోపాల్, ప్రియాంక, చైతన్య పాల్గొన్నారు.

వైద్య కళాశాలలపై వైసీపీ సంతకాల సేకరణ


జ్ఞానాపురం ప్రాంతంలో సంతకాలు సేకరిస్తున్న కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, ఇతర మహిళా నాయకులు

జ్ఞానాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో నిర్వహించే అంశాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ నాయకులు బుధవారం సంతకాలు సేకరించారు. జ్ఞానాపురం ప్రాంతంలో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఇంటింటికీ వెళ్లి గవర్నర్ పేరిట రాసిన లేఖపై సంతకాలు చేయించారు. ఈ అంశంపై ప్రజలు సానుకూలంగా స్పందిస్తున్నారన్నారు. మహిళా నాయకులు ఆదిలక్ష్మి, మేరీ, మణి, మంగ, ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

మాధవధార: కళింగనగర్ ప్రాంతంలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యంలో వైద్య కళాశాలలపై ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. స్థానిక నాయకులు పైడి శ్రీనివాసరావు, తాటిపూడి రత్న, రామారావు, నాగలక్ష్మి పాల్గొన్నారు. గురువారం మురళీనగర్ ప్రాంతాల్లో కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు 50వ వార్డు కార్పొరేటర్ వి.ప్రసాద్ తెలియజేసారు. ప్రజలంతా కార్యక్రమంలో భాగమై ప్రైవేటీకరణ వలన మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య దూరమయ్యే ప్రమాదాన్ని అడ్డుకోవాలని కోరారు.

గోతులమయంగా పట్టాభిరెడ్డితోట సీసీ రోడ్లు


ఆర్టీసీ బస్టాపు ఎదుట కుంగిన రోడ్డు

మురళీనగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 49వవార్డులో రహదారులు దెబ్బతినడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పట్టాభిరెడ్డితోట నుంచి పాలిటెక్నిక్ ప్రహరీగోడను ఆనుకొని ఉన్న సిమెంటు రహదారి గోతులమయమైంది. మురళీనగర్ మెయిన్‌రోడ్డులో సెక్టర్ 8 ఆర్టీసీ బస్టాపు వద్దే తారురోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కుంగిపోయింది. రహదారి అంచున రోడ్డు కూరుకుపోవడంతో వాహనదారులు గోతుల్లో పడకుండా షాపుల నిర్వాహకులే రాళ్లతో నింపి, కర్రలు పాతారు. వార్డు ఇంజనీరింగ్ విభాగం అధికారులుగానీ, ప్రజాప్రతినిధులు గానీ ఇటుగా చూడటం లేదని ప్రయాణికులు, రోడ్ల వెంబడి ఉన్న దుకాణాల నిర్వాహకులు వాపోతున్నారు. అధికారులు రోడ్ల మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

మరింత సమర్థంగా ఆహార భద్రతా విభాగం

... 5వ పేజీ తరువాయి

రావడంతో సమీక్షించాం. ఆహారంలో రంగుల వినియోగంపై ప్రజలను అప్రమత్తం చేయాలని విభాగాన్ని ఆదేశించాం' అని రఘురామ పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఫిర్యాదుల కమిటీ సభ్యులు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పి.విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆహార భద్రతా విభాగం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ప్రమాదకర రంగులు వాడే దుకాణాలను మూయించండి

▸▸ రోడ్డు పక్క దుకాణాల్లో ఆహార పదార్థాల తనిఖీలో అధికారులకు ఎమ్మెల్యే సూచన


ఆహార పదార్థం వాసన చూస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాల్లో హానికరమైన రంగులు వాడుతున్న దుకాణాలను వెంటనే మూసివేయించాలని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అధికారులను ఆదేశించారు. ఆహార పదార్థాలు ప్రజల ఆరోగ్యానికి చేటు తెచ్చేలా ఉండకూడదని పేర్కొన్నారు. సీతమ్మధారలోని పలు ప్రాంతాల్లో ఫుడ్ కోర్టు దుకాణాలను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి బుధవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. రంగులు, ఇతర ప్రమాదకరమైన పదార్థాలు వాడుతున్న దుకాణదారులపై చర్యలుతీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఆయనపై ఆరోపణలు అనేకం

... 5వ పేజీ తరువాయి

నగర్‌లో అంబేడ్కర్ విగ్రహం తొలగింపు వివాదంలో తనకు కలెక్టర్ షోకాజ్ నోటీస్ జారీచేయడం వెనుక డీఆర్వో ప్రమేయం ఉందని ఆర్‌డీఓ శ్రీలేఖ అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే డీఆర్వో అవినీతిపై ఆమె కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. అంతకు ముందు అంటే ఎనిమిది నెలల క్రితం కూడా తనను డీఆర్‌ఓ వేధిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్టు సమాచారం.

పార్కులో ఎట్టకేలకు మరమ్మతులు

కంచరపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 54వ వార్డు పరిధి జాతీయ రహదారి అచ్చిబాబు ఫంక్షన్ హాల్ వద్ద గ్రీన్‌బెల్ట్ పార్కులో అధికారులు ఎట్టకేలకు మరమ్మతులు ప్రారంభించారు.గతంలో ఇక్కడ గ్రీన్‌బెల్ట్‌లో వాకింగ్ ట్రాక్ నిర్మించి బెంచీలు ఏర్పాటు చేశారు. ఆ బెంచీలు విరిగిపోవడం, వాకింగ్ ట్రాక్ మరమ్మతులకు గురికావడంతో స్థానికులు ఇబ్బంది పడేవారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం సమయాల్లో పార్కుకు పిల్లలు, వృద్ధులు, మహిళలు అధికంగా వస్తుండడంతో దీనిని ఉపయోగకరంగా ఉండేలా తీర్చిదిద్దాలని స్థానికులు ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు విజ్ఞప్తి చేశారు. ఆయన ఆదేశాల మేరకు రూ.19 లక్షలతో పెద్దలు వ్యాయామం చేసుకోవడానికి జిమ్ ఏర్పాటు చేస్తారు. మరో రూ.9 లక్షలతో పార్కులో కొత్తగా 15 విద్యుద్దీపాల ఏర్పాటు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. వారం రోజులుగా జరుగుతున్న పనులను బుధవారం బీజేపీ వార్డు అధ్యక్షుడు రంగుముద్ర రాంబాబు, చల్లా వెంకటేష్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. పనుల్లో నాణ్యతపై ఆరా తీసి త్వరితగతిన పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు.


గ్రీన్‌బెల్ట్ పార్కులో పనులు చేపడుతున్న దృశ్యం

తిరుపతి రైళ్లు ఫుల్

.. 5వ పేజీ తరువాయి

ఎక్స్‌ప్రెస్, ప్రతి ఆది, బుధవారాల్లో అందుబాటులో ఉండే బిలాస్‌పూర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్ (17481) రైళ్లకు నవంబరులో బెర్తులు లభించే పరిస్థితి ఉంది.

వారాంతపు, బైవీక్లీ రైళ్లకు తీవ్ర డిమాండ్

విశాఖ మీదుగా నడిచే వారాంతపు, బైవీక్లీ రైళ్లకు కూడా తీవ్ర డిమాండ్ ఏర్పడింది. ప్రతి శనివారం నడిచే భువనేశ్వర్-తిరుపతి (22879) ఎక్స్‌ప్రెస్‌కు డిసెంబరు 20 వరకు, అలాగే ప్రతి ఆదివారం భువనేశ్వర్‌లో బయలుదేరి విశాఖ మీదుగా తిరుపతి వెళ్లే భువనేశ్వర్-తిరుపతి (22871) ఎక్స్‌ప్రెస్‌కు డిసెంబరు 21 వరకు బెర్తులు నిండిపోయి నిరీక్షణ జాబితా ఏర్పడింది. ఖరగ్‌పూర్-విల్లుపురం (22603), సంత్రాగచ్చి-మంగళూరు వివేక్ ఎక్స్‌ప్రెస్ (22815), భగల్‌పూర్-బెంగళూరు అంగా ఎక్స్‌ప్రెస్ (12254), షాలిమార్-నాగర్‌కోయిల్ గురుదేవ్ ఎక్స్‌ప్రెస్ (12660). పురిలియా-విల్లుపురం (22605), హటియా-బెంగళూరు (18637), భువనేశ్వర్-బెంగళూరు (12845), హౌరా-తిరుపతి హంసఫర్ (20889), సంత్రాగచ్చి-తిరుపతి (22855), హౌరా-పాండిచ్చేరి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12867) రైళ్లకు తీవ్ర డిమాండ్ ఏర్పడింది.

షిర్డీ రైలుకు నవంబరు 20 వరకూ బెర్తులు ఫుల్

విశాఖ నుంచి ప్రతి గురువారం బయలుదేరే సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ (18503)లో నవంబరు 20 వరకూ బెర్తులు రిజర్వు అయిపోయాయి. నవంబరు 27 నుంచి డిసెంబరు 18 వరకు బెర్తులు లభ్యమవుతున్నాయి. వారానికి ఒక్కరోజు మాత్రమే ఈ రైలు అందుబాటులో ఉన్న నేపథ్యంలో షిర్డీ ఎక్స్‌ప్రెస్‌కు ఆక్యుపెన్సీ పెరుగుతోంది. షిర్డీ వెళ్లేవారికి ప్రత్యామ్నాయంగా విశాఖ-ఎల్‌టీటీ వయా సికింద్రాబాద్ (18519), విశాఖ-ఎల్‌టీటీ వయా రాయగడ (22847), కోణార్క్ (11020) ఎక్స్‌ప్రెస్ రైళ్లలో మన్మాడ్ వరకు వెళ్లే అవకాశం ఉన్నా ఎక్కువగా సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్‌కే ప్రాధాన్యమిస్తారు. ఈ నేపథ్యంలో షిర్డీ ఎక్స్‌ప్రెస్‌ను బైవీక్లీగా నడపాలని డిమాండ్ చాలాకాలంగా ఉంది.

దువ్వాడ మీదుగా ఎర్నాకులం నుంచి బరౌనికి నేడు ప్రత్యేక రైలు

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ మీదుగా ఎర్నాకులం నుంచి బరౌనికి (ఒకవైపు మాత్రమే) గురువారం (23న) ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. 06183 నంబరు గల రైలు గురువారం ఉదయం 10 గంటలకు ఎర్నాకులంలో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 2.50 గంటలకు దువ్వాడ చేరుతుంది. తిరిగి 2.55 గంటలకు బయలుదేరి విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు మీదుగా శనివారం రాత్రి 8 గంటలకు బరౌని చేరుతుందని పేర్కొన్నారు. ఈ రైలుకు ఆరు థర్డ్ ఏసీ, 12 స్లీపర్, రెండు సెకెండ్ క్లాసు కమ్ లగేజి కమ్ దివ్యాంగుల కోచ్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మళ్లింపు మార్గంలో హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్

విశాఖ-అమృత్‌సర్ మధ్య నడిచే హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ (20807) ఖుర్దారోడ్డు డివిజన్‌లో పవర్ బ్లాక్ పనులు చేపడుతున్న నేపథ్యంలో ఈ నెల 24, 25 తేదీల్లో తాల్చేర్ స్టేషన్‌కు వెళ్లకుండా తాల్చేర్ రోడ్డు మీదుగా అమృత్‌సర్‌కు చేరుకుంటుందని రైల్వే అధికారులు తెలిపారు. తిరుగు ప్రయాణంలో అమృత్‌సర్-విశాఖ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ (20808) ఈ నెల 25న తాల్చేరు స్టేషన్‌కు చేరకుండా వయా తాల్చేరు రోడ్డు మీదుగా విశాఖకు వస్తుందని పేర్కొన్నారు.

రాజకీయ ప్రయోజనం కోసమే గూగుల్‌పై అసత్య ప్రచారం

... 5వ పేజీ తరువాయి

తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. స్వప్రయోజనాలు, స్వలాభాల కోసం ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. విపక్షాలు నిర్మాణాత్మక పాత్ర పోషించాలని, వీలైతే ప్రజలకు అవగాహన కల్పించాలి తప్ప రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుదోవ పట్టించకూడదన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి సమపాళ్లలో ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకువెళతుందన్నారు. పార్టీ నాయకులంతా పరిశ్రమల ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలకు ప్రజలకు వివరించాలన్నారు.

వైఎస్ హయాంలో బ్రాండిక్స్‌కు ఎకరా రూపాయికే ఇచ్చారు


అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

గూగుల్ రాకతో విశాఖకు మరికొన్ని కంపెనీలు వస్తాయని అనకాపల్లి శాసనసభ్యుడు కొణతాల రామకృష్ణ అన్నారు. బుధవారం శాసనసభా ఫిర్యాదుల కమిటీ సమీక్షకు హాజరైన ఆయన అనంతరం కలిసి విలేకరులతో మాట్లాడుతూ అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ, విశాఖలో టీసీఎస్, మరికొన్ని కంపెనీల ఏర్పాటుతో రాష్ట్రంలో ఐటీ రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. విశాఖలో టీసీఎస్‌కు ఎకరా 99 పైసలకే ఇచ్చారని తప్పుబడుతున్నారని, రాజశేఖర్‌రెడ్డి హయాంలో అచ్యుతాపురంలో బ్రాండిక్స్ కంపెనీకి ఎకరా రూపాయికే ఇచ్చారని కొణతాల గుర్తుచేశారు.

...అయితే ఓకే

... 5వ పేజీ తరువాయి

వినిపిస్తున్నాయి. అలాగే గిరి ప్రదక్షిణ సందర్భంగా 120 లీటర్ల సామర్థ్యం కలిగిన 570 ప్లాస్టిక్ డ్రమ్ములను రూ.1,200 చొప్పున, 200 లీటర్ల సామర్థ్యం కలిగిన వంద డ్రమ్ములను రూ.రెండు వేల చొప్పున కాంట్రాక్టర్ కొనుగోలు చేశారంటూ బిల్లు చెల్లింపు అంశాన్ని అజెండాలో ప్రతిపాదించగా కమిటీ సభ్యురాలు సాడి పద్మారెడ్డి అభ్యంతరం తెలిపారు. తనకు డ్రమ్ముల వ్యాపారంలో అనుభవం ఉందని, డ్రమ్ములను అద్దెకు తీసుకుంటే ఒక్కో దానికి రూ.50 నుంచి రూ.వంద ఖర్చు అవుతుందని, అలాంటిది ఏకంగా రూ.రెండు వేలు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఒకవేళ కొనాలనుకున్నా 120 లీటర్ల డ్రమ్ములను రూ.700కి, 200 లీటర్ల డ్రమ్ములను రూ.800కి సరఫరా చేసేవారున్నారని చెప్పారు. అంత మొత్తం ఖర్చు పెట్టి కొనుగోలు చేసిన 670 డ్రమ్ములు ఇప్పుడు ఎక్కడున్నాయని ఆమె ప్రశ్నించారు. ఇదంతా అడ్డగోలు దోపిడీయేనని, ఆ అంశాన్ని తిరస్కరించాలని మేయర్‌ను కోరారు. దీంతో ఆ అంశాన్ని వాయిదా వేస్తున్నట్టు మేయర్ ప్రకటించారు. కొంతసేపటి తర్వాత ఆయా అంశాలపై సంబంధిత అధికారి వివరణ ఇస్తానని కోరగా, సభ్యులు సరేనని అనుమతించడంతోపాటు డ్రమ్ముల ఫొటోలు చూపించాలనే షరతుపెట్టి ఆమోదించేస్తున్నట్టు ప్రకటించడం ఆశ్చర్యం కలిగించింది. జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి అంశానికి ఆమోదం తెలిపే వ్యవహారంలో కూడా మేయర్ పేషీలోని ఒక ప్రైవేటు వ్యక్తి రూ.పది వేలు చొప్పున వసూలు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్ని అంశాలను గుడ్డిగా ఆమోదించడంలో అంతర్యమేమిటని స్టాండింగ్ కమిటీలోని ఒక సభ్యుడిని ప్రశ్నించగా...మేయర్ పేషీలోని ఒక ప్రైవేటు వ్యక్తి ఒత్తిడి చేయడంతోనే తాము నోరెత్తలేకపోతున్నామని వాపోయారు.

ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందాలి

... 5వ పేజీ తరువాయి

అధికారులను ఆదేశించింది. ఈ క్రమంలో కేజీహెచ్‌లో హీమోఫీలియా వ్యాధిగ్రస్తులకు అందుతున్న సేవలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు చేపడుతున్న చర్యలు, ఎన్టీఆర్ వైద్య సేవలపై కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కమిటీ సభ్యులు పలు సూచనలిచ్చారు. హీమోఫీలియాతో వస్తున్న వారికి తక్షణ సాయం అందించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రూ.48 వేలకు తగిన మందులు ఇవ్వాలన్నారు. డే కేర్ కేటగిరీలో వైద్య సేవలు అందించాలని కమిటీ చైర్మన్ సూచించారు. అంగవైకల్యం ధ్రువపత్రాలు అందించేందుకు ఉన్నతస్థాయిలో చర్చించి చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖ డిప్యూటీ సెక్రటరీ శోభికను చైర్మన్ ఆదేశించారు. అనకాపల్లి జిల్లాలో 53 కేసులున్నాయని, వారికి వైద్య సేవలు అందుతున్నాయని సంబంధిత అధికారులు వివరించారు.

అనంతరం ఫుడ్ సేఫ్టీ విభాగంలో జరుగుతున్న కార్యకలాపాలు, చేపడుతున్న చర్యలపై కమిటీ సమీక్షించింది. స్టార్ హోటల్ మొదలుకొని వీధుల్లోని చిన్న హోటళ్ల వరకు ఆహారం కల్తీ జరుగుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు అప్రమత్తంగా ఉంటే ప్రజారోగ్యానికి భరోసా లభిస్తుందని డిప్యూటీ స్పీకర్ అన్నారు. ఇటీవల కురుపాం వసతిగృహంలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా విస్తృత తనిఖీలు, పరీక్షలు నిర్వహించాలన్నారు. ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో కలర్స్ వాడకుండా చర్యలు తీసుకోవాలని, చికెన్, మటన్ తనిఖీలు చేపట్టాలన్నారు. సిబ్బంది కొరత గురించి ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రస్తావించగా సచివాలయాల్లో విద్యార్హతలున్న వారిని వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలను ప్రభుత్వానికి నివేదిస్తామని, సకాలంలో ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. మూడు నెలలకొకసారి విశాఖ వేదికగా సమావేశం నిర్వహిస్తామని చైర్మన్ తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, కొణతాల రామకృష్ణ, కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, శాసనసభ డిప్యూటీ సెక్రటరీ కె.రాజకుమార్, అధికారులు పాల్గొన్నారు.

శివాలయాల వద్ద కార్తీక సందడి

» నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు సన్నాహాలు
» భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు


కొత్త వెంకోజీపాలెంలోని ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయం

వెంకోజీపాలెం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం పూజలకు శివాలయాలన్నీ సిద్ధమయ్యాయి. ఇప్పటికే ఆలయాలకు రంగులు అద్దారు. దేవస్థానం, ప్రైవేటు నిర్వాహకుల ఆధ్వర్యంలో శివాలయాల్లో కార్తీకమాసం పూజలు, వివిధ కార్యక్రమాల నిర్వహణకు ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అధిక సంఖ్యలో విచ్చేసే భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా నిర్వాహకులు విశేష ఏర్పాట్లు చేపడుతున్నారు.

కొత్త వెంకోజీపాలెంలోని శ్రీరామానంద ఆశ్రమం దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలోని శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వర ఆలయంలో బుధవారం నుంచి నవంబరు 21 వరకు కార్తీకమాస పూజలు నిర్వహించనున్నట్టు ఆలయం కార్యనిర్వాహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. 22న ఉదయం 10 గంటలకు మంగళధ్వనితో ప్రారంభమై అఖండ దీపారాధన, విఘ్నేశ్వర పూజ, పంచ పల్లవ సహిత పంచామృత నారికేళ అభిషేకాలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం 6.30 గంటలకు ఆకాశ జ్యోతి ప్రజ్వలన ధ్వజస్తంభ శిఖరాగ్ర భాగంలో ప్రారంభం జరుగుతుందని చెప్పారు. . నెల రోజుల పాటు ఆలయ ప్రధానార్చకులు అరవెల్లి సూర్యప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో ల అర్చకులు భక్తులకు ఆలయ సముదాయంలోని శివాలయం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వినాయక, రాజరాజేశ్వరి, ఆంజనేయస్వామి, అయ్యప్ప దేవాలయం తదితర ఆలయాల్లో విశేష అభిషేకాలు నిర్వహించనున్నారు.

ఈ నెల 25న నాగుల చవితి వేడుకలు ఆలయ వద్ద నున్న పుట్టలో పూజలు, 26న నాగపంచమి పూజలను సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న నాగేంద్రుడి వద్ద జరుపనున్నట్టు అర్చకులు పేర్కొన్నారు. ఈ నెలలో ప్రతి రోజూ ఆలయానికి రావడం వీలుకాని భక్తులకు ప్రత్యేక టిక్కెటు సదుపాయం కల్పించినట్టు చెప్పారు. ఈ కార్తీక మాస పూజలకు స్థానిక గ్రామ సేవా సంఘం కార్యవర్గ సభ్యులు, గ్రామస్థులు తమ సహాయ సహకారాలు అందించనున్నట్టు తెలియజేశారు. అలాగే హెచ్‌బీ కాలనీ, కేఆర్‌ఎం కాలనీ, ఇసుకతోట శివాలయాల్లో, ఎంఎంటీసీ కాలనీ త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ కార్తీక మాసోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ ప్రాంతంలో గల అన్న శివాలయాల్లో కార్తీక శోభ సంతరించుకున్నాయి. ఈ నెల నుంచి శివాలయాల్లో కార్తీకమాస ప్రత్యేక పూజలు, ఆవరణలో ఆధ్యాత్మిక, భక్తి కార్యక్రమాలను విరివిగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. డ్రైవర్ కాలనీలో వెలసిన బాల త్రిపుర సుందరీ సహిత మల్లేశ్వర స్వామి ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. బుధవారం వేకువ జామున నాలుగు గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త కృష్ణంరాజు తెలిపారు. తొలుత శివుడికి వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య పవిత్ర గంగాజలాలతో అభిషేకాలు చేస్తారని తెలిపారు.. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.


పూజలకు సిద్ధమైన కొత్తవెంకోజీపాలెం శివాలయం

పెదవాల్తేర్‌లో..

పెదవాల్తేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పెదవాల్తేరులోని శ్రీకాశీవిశ్వేశ్వర ఆలయంలో కార్తీక మాస ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఆలయ చైర్మన్ సీహెచ్ జ్యోతి అధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయ పరసరాలను పరిశుభ్రం చేయించారు. ఆలయాన్ని రంగులు, విద్యుత్ దీపాలతో శోబాయమానంగా అలంకరించి ముస్తాబు చేశారు. ఈ నెల 27న కార్తీక మాసం తొలి సోమవారం కావడంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. కార్తీక మాస ప్రత్యేక పూజలు, అభి షేకాలు నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ సీహెచ్ జ్యోతి తెలిపారు.


ఆరిలోవ : విద్యుద్దీపాలతో అలంకరించిన డ్రైవర్స్ కాలనీలోని శివాలయం

అలాగే.. లాసన్స్ బే కాలనీలోని శ్రీఅసంఘానందాశ్రమం, శ్రీమృత్యుంజయ స్వరాలయాలను రంగులతో ముస్తాబు చేశారు. ఆశ్రమ అధ్యక్షుడు, శ్రీవిష్ణు సేవానందగిరి స్వామి ఆశీస్సులతో ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి, కాగితాల సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో కార్తీక మాసంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.ఈ ఆలయంలో భక్తులే స్వయంగా అభిషేకం చేసుకునే వీలు ఉండడం ఒక విశేషం.భక్తులు నుంచి ఎటువంటి రుసుం తీసుకోకుండా సేవాభావంతో ప్రతి ఒక్కరికీ భగవంతుని దర్శించుకొని అభిషేకించుకునే ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తలు చేశారు.


పెదవాల్తేర్ : రంగులు వేసిన లాసన్స్ బే కాలనీలోని శ్రీఅసంఘానందాశ్రమం శ్రీమృత్యుంజయ స్వరాలయం

ఎక్కడికక్కడే పైపులైన్ల లీకేజీ

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ స్థానికుల ఆరోపణ

పెదవాల్తేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 19వ వార్డు పెదజాలారిపేట మెయిన్ రోడ్, ఆదర్శ గ్రామంలో కొళాయి పైపులైన్లకు లీకులు పడి తాగు నీరు వృథాగా పోతోంది. గత కొన్ని రోజులుగా లీకేజీలతో ఈ విధంగా తాగునీరు రహదారిపై ప్రవహిస్తోందని, దీంతో కొళాయిల్లో నీటి ధార తగ్గిపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజులుగా ఈ సమస్య ఉండగా,, ఫిర్యాదు చేసినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనిపై నీటి సరఫరా విభాగంనకు ఫిర్యాదు చేస్తే వర్కర్లు వచ్చి పైపులైన్లు మరమ్మతులు చేస్తున్న కొన్ని రోజుల తర్వాత మళ్లీ పైపులైన్లు లీక్ అవుతున్నాయని స్థానికలు వాపోతున్నారు. ఆధికారులు పైపులైన్లు శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని సాన్థినికులు కోరుతున్నారు.


ఆదర్శ గ్రామంలో వృథాగా అవుతున్న నీరు


పెదజాలరిపేటలో...

కార్తీక మాసోత్సవాలు ప్రారంభం

వెంకోజీపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెంలోని జ్ఞానానంద ఆశ్రమం, దేవదాయ శాఖ ఆధీనంలోని శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో కార్తీక మాసోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవస్థానం ఈవో బండా ప్రసాద్, సభ్యులు, గ్రామ సేవా సంఘం కార్యవర్గం, సభ్యులు స్థానిక భక్తులతో కలిసి అఖండ జ్యోతిని వెలిగించి, కార్తీకమాసోత్సవాలు ప్రారంభించారు. భక్తులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్థంభం వద్ద ఆకాశజ్యోతిని గ్రామ సేవా సంఘం సభ్యులు ప్రారంభించారు. నెల రోజుల పాటు ప్రతీ రోజు ఉదయం పూజలు, సాయంత్రం ఆకాశజ్యోతిని వెలిగించనున్నట్టు అర్చకులు పేర్కొన్నారు. వచ్చే నెల 5న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఆ రోజు సాయంత్రం ఆలయ ప్రాంగణంలో జ్వాలాతోరణం నిర్వహించనున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సిబ్బంది, గ్రామసేవా సంఘం కార్యవర్గ ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు. అలాగే ఇసుకతోట, హెచ్‌బీ కాలనీ, కేఆర్‌ఎం కాలనీలలోని శివాలయాల్లో కార్తీక మాసోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఎంఎంటీసీ కాలనీలో త్రిమూర్తిక వెంకటేశ్వరస్వామి ఆలయం, కొత్త వెంకోజీపాలెంలోని వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయం, పాత వెంకోజీపాలెం శ్రీసీతారామాలయాల్లోనూ ఉన్న ధ్వజస్థంభాల వద్ద ఆకాశజ్యోతిలను వెలిగించారు.


ధ్వజస్థంభం వద్ద ఆకాశ జ్యోతి వెలిగిస్తున్న భక్తులు

సినిమా గైడ్

- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శరత్, శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య, ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజీ** కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి**: సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 17, టమాటా 25, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలు పు) 46, బెండకాయలు 36, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 22, క్యారెట్ 52, దొండకాయలు 38, బంగాళదుంపలు 18, అరటి కాయ (పె)8, మునక్కాడలు (కిలో) 68, అల్లం (పాత ది) 70, బరబాటి 38, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్ధచిక్కుడు 66, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 54, కీర దోస 22, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడ దుంపలు 36, కంద 48, దేముడు చిక్కుడు 76, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 22, మామిడి అల్లం 90, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు	
బ్రాయ్‌గ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

క్రమశిక్షణాయుత విద్య అలవరచుకోవాలి

» డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు సూచించారు. కళాశాలలో బుధవారం నూతన విద్యార్థుల ఏ విధంగా నడుచుకోవాలో అవగాహన కల్పిస్తూ దీక్షారంబ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల నియమ నిబంధనలకు అనుగుణంగా విద్యార్థులు మెలగాలన్నారు. తరగవులకు డుమ్మా కొట్టకుండా ప్రతీ పాఠ్యంశం శ్రద్ధతో అభ్యసించి మంచి మార్కులు సాధించాలన్నారు. కళాశాలలో ఎన్నో మెరుగైన సదుపాయాలు, నైపుణ్యాలు పెంచుకునే టెక్నాలజీ ఉందని, అవకాశాలను అందిపుచ్చుకుని మంచి భవిష్యత్తుకు మార్గం వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అకడమిక్ కో-ఆర్డినేటర్ రాజేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంత నిర్లక్ష్యమా?

» పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించిన సిబ్బంది » పట్టించుకోని జీవీఎంసీ అధికారులు
» పలు ప్రాంతాల్లో చెత్తకుప్పలు » కాలువల్లో నెలల తరబడి తొలగించని పూడికలు
» దుర్గంధం, దోమలతో ప్రజల అవస్థలు » జ్వరాల పాలవుతున్న జనం

పెదవాల్తేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 19వ వార్డు పెదజాలారిపేట చేపల మార్కెట్ వద్ద గల డ్రైనేజీలు చెత్తకుప్పలతో నిండిపోయాయి. దీంతో ఈ ప్రాంతంలో పగలూ రాత్రి తేడా లేకుండా దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది జ్వరాల సీజన్ కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ కాలువలపై స్థానికులు పనికిరాని వస్తువులు, చిన్న బడ్డీలు, చెత్తాచెదారం వేస్తుండడంతో జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది అందులోని వ్యర్థాలను తీయలేని పరిస్థితి నెలకొంది. దీంతో నెలల తరబడి కాలువల్లో చెత్తాచెదారాలు పేరుకుపోయి దుర్గంధం వ్యాప్తిస్తోంది. దీనివల్ల స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. కాలువలో మురుగు నీరు ప్రవహించే అవకాశం లేకుండాపోతోంది. ఫలితంగా ఎక్కడపడితే అక్కడ కాలువలు బ్లాక్ అయిపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అంతేకాకుండా స్థానికులు రోడ్ల మీద వ్యర్థాలు వేయడంతో పెంటకుప్పలను తలపిస్తోందని, దీంతో ఆ ప్రాంతం అంతా దుర్వాసన వెదజల్లడంతో అటు వైపు ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోందని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి తక్షణమే సమస్యను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పెదజాలరిపేటలో కాలువలపై వేసిన పనికి రాని సామగ్రి, వీధుల్లో చెత్తాచెదారం

డాక్టర్ అంబేడ్కర్ గురుకులం సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ప్రధాన కార్యదర్శి

ఆరిలోవ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారం సమీపంలోని శ్రీకృష్ణాపురంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి.సన్యాసినాయుడు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. డార్మేటర్, వంటగదిని పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం ఆయన పాఠశాలలో గల ఆర్ట్ గ్యాలరీని సందర్శించారు. విద్యార్థులు వేసిన పలు చిత్రాలను చూసి ఆనందం వ్యక్తం చేశారు. చిన్నారుల ప్రతిభ అమోఘమంటూ ప్రశంసలు కురిపించారు. ముఖ్యంగా స్టిక్స్‌తో రూపొందించిన తాజ్‌మహల్ చిత్రంతో పాటు ఆరో తరగతి విద్యార్థి రామ్‌ప్రసాద్ స్టిక్స్‌తో రూపొందించిన ల్యాండ్ స్కేపింగ్ ఆర్ట్, మరికొన్ని చిత్రాలను చూసి అభినందించారు. ప్రశంసా పత్రాన్ని అందజేశారు. విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందిస్తున్నారంటూ డ్రాయింగ్ మాస్టర్ సుధాకర్‌ను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయ కర్త గ్రేసీ, ప్రిన్సిపాల్ రత్నవల్లి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులు వేసిన పెయింటింగ్స్, స్టిక్ వర్క్ ఆర్ట్‌ను పరిశీలిస్తున్న జస్టిస్ సన్యాసినాయుడు

సఖీ సురక్ష.. మహిళల పాలిట సంజీవని

» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఆరిలోవ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం అమలు చేస్తున్న సఖీ సురక్ష పథకం సంజీవని వంటిదని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. గ్రేటర్ విశాఖ 13వ వార్డులోని జీవీఎంసీ కల్యాణ మండపంలో మెప్మా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సఖీ సురక్ష కార్యక్రమాన్ని కార్పొరేటర్ కెల్ల సునీతతో కలిసి ఎమ్మెల్యే వెలగపూడి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సఖీ సురక్ష ద్వారా మహిళా ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందన్నారు. కాబట్టి ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి మహిళా వినియోగించుకోవాలని సూచించారు. సుమారు 300 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీడీఈవో శ్రీరామ్, సీవో అప్పలకొండ, టీడీపీ 13వ వార్డు అధ్యక్షుడు పి.ధర్మారావు, 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, పార్లమెంటరీ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

మాదిన ప్రసాదరావుకు రైతు నేస్తం పురస్కారం

» 26న హైదరాబాద్‌లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ప్రదానం



మద్దిలపాలెం/ ఆరిలోవ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పద్మశ్రీ ఐవీ సుబ్బారావు రైతు నేస్తం పురస్కారాన్ని డాక్టర్ మాదిన ప్రసాదరావుకు ప్రదానం చేస్తున్నట్టు రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఈనెల 26న నిర్వహించే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పాల్గొంటారని చెప్పారు. విశాఖ పశుసంవర్ధక శాఖ సహాయసంచాలకుడుగా పని చేస్తున్న మాదిన ప్రసాదరావు రైతులకు అవగాహన కల్పించే ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. పాడి, కోళ్ల మొదలైన రంగాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ఎంతోమందికి శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. 31 సంవత్సరాలుగా మూగ జీవాలకు సేవలందించడంవంటి అంశాలు పరిగణనలోకి తీసుకుని ఆయనకు రైతు నేస్తం పురస్కారం అందిస్తున్నట్టు పేర్కొన్నారు. రైతునేస్తం పురస్కారానికి ప్రసాదరావు ఎంపిక కావడంపై రాష్ట్ర పశుసంవర్ధక డైరెక్టర్ దామోదర్‌నాయుడు, అదనపు డైరెక్టర్ ఎండ సింహాచలం, జిల్లా జాయింట్ డైరెక్టర్ శంకరరావు, ఉప సంచాలకులు చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు.

జీతాల పెంపు కోరుతూ అద్దె బస్సు డ్రైవర్ల ఆందోళన



సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తున్న అద్దె బస్సుల డ్రైవర్లు

మద్దిలపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో పని చేస్తున్న అద్దె బస్సుల డ్రైవర్ల జీతాలు పెంచాలని సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు డిమాండ్ చేశారు. మద్దిలపాలెం ఆర్టీసీ డిపో వద్ద బుధవారం అద్దె బస్సుల డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న వెంకటరావు మాట్లాడుతూ అగ్రిమెంట్ కాలం ముగిసి ఏడాదైన అద్దె బస్సు డ్రైవర్ల జీతాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. డ్రైవర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చే వరకు ఉద్యమిస్తామన్నారు. జీతంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, నైట్ హాల్ట్ అలవెన్స్, ఇన్సూరెన్స్ జిల్లా పాస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డ్రైవర్ల సమస్యలపై అయిదు రోజుల నుంచి సమ్మె చేస్తున్నా, ఇప్పటి వరకూ అద్దె బస్సుల యజమానులు చర్చలకు రాలేదన్నారు. అవుట్ సోర్సింగ్ డ్రైవర్లకు 8 గంటల పనికి రూ.వెయ్యి చెల్లిస్తున్నారని, డ్యూటీ చేస్తున్న డ్రైవర్లకు 8 గంటలకు రూ.600 చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.కుమారి, డ్రైవర్లు పాల్గొన్నారు.

సంప్రదాయానికి ప్రతీక వస్త్రధారణ


వివిధ రాష్ట్రాల సంప్రదాయ వస్త్రధారణతో అలరించిన విశాఖ వేలీ స్కూలు విద్యార్థులు

ఆరిలోవ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మనం ధరించే వివిధ రకాల దుస్తులు మన సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని దేవదాయ శాఖ విశ్రాంత కమిషనర్ వైవీ అనూరాధ అన్నారు. బుధవారం విశాఖ వేలీ స్కూలులో నిర్వహించిన హెరిటేజ్ బ్యాడ్జెస్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అనూరాధ మాట్లాడుతూ మన సంస్కృతిని అవగాహన పెంపొందించుకొని, మన పెద్దలు చూపించిన మార్గంలో నడవాలని సూచించ్చారు. విద్యార్థుల్లో మన వారసత్వ అంశాలపై అవగాహన కల్పించేందుకు హెరిటేజ్ క్లబ్ ప్రారంభించడం మంచి పరిణామమన్నారు. ధర్మానికి కట్టుబడి ఉంటే విజయం వరిస్తుందన్నారు. మన ఆచారాలు, సంప్రదాయాలు, పండుగల గురించి తెలుసుకోవడం, గౌరవించడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా.. విద్యార్థులు మనదేశంలో గల 29 రాష్ట్రాల సంప్రదాయ దుస్తులు ధరించి ఆకట్టుకున్నారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఇటువంటి కార్యక్రమాలను మరిన్ని చేపట్టాలని ప్రిన్సిపాల్‌ను అనూరాధ సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరీప్రభాకర్, సీఏ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో దుకాణాల కేటాయింపు


డ్రా తీసి దుకాణాలు కేటాయిస్తున్న జేసీ మయూర్ అశోక్. పక్కన ఇతర అధికారులు

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతుబజార్లలో ఖాళీగా ఉన్న 120 దుకాణాలకు కలెక్టరేట్‌లో బుధవారం లాటరీ తీసి రైతులకు కేటాయించారు. రైతుల సమక్షంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ డ్రా నిర్వహించారు. కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించారని రైతులు సంతోషం వ్యక్తంచేశారు.


ద్వారకా బస్సు కాంప్లెక్స్‌లో బస్సుల చుట్టూ జనసందోహం


ఆర్టీసీ కాంప్లెక్స్ లోపల ఖాళీ లేక రన్‌వేపై నిరీక్షిస్తున్న ప్రయాణికులు, విద్యార్థులు

ఆర్టీసీ ప్రయాణ కష్టాలు ఇన్నన్ని కాదయా..!

మహారాణిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారులు నిత్యం సంచరించే ద్వారకా ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్‌లో ప్రయాణికులు ప్రమాదకర రీతిలో బస్సుల కోసం పరుగులు తీస్తున్నా కట్టడి చేసే నాథుడు లేడు. పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి బస్సులు వచ్చి ఆగే రన్‌వే మీదకే ఆత్రంగా ప్రయాణికులు వచ్చేస్తున్నారు దీనితో ఎప్పుడు, ఎవరికి ప్రమాదం సంభవిస్తుందోనని ఆర్టీసీ అధికారులు హైరానా పడుతున్నారు. ఆర్టీసీ ద్వారకా బస్సు కాంప్లెక్స్ లో నెల రోజులుగా ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రకటించటంతో ఇప్పుడు ప్రతీ ఒక్క మహిళ ఉచితంగా ప్రయాణించేందుకు ఇష్టపడుతున్నారు. దారిలో బస్సులు ఆపకపోవడం, ఆపినా సీట్లు దొరక్కపోవడంతో ద్వారకా బస్సు కాంప్లెక్స్‌కు వచ్చి గమ్యానికి వెళ్లాల్సిన బస్సు కోసం పరుగులు తీస్తున్నారు. ఈ కారణంగా కాంప్లెక్స్ లోపల ప్లాట్‌ఫాంలు కిక్కిరిసిపోతున్నాయి. అక్కడ స్థలం చాలక బస్సులు రన్ వే మీదకు వచ్చే చోటుకు ప్రయాణికులు ఎగబడుతున్నారు. దూర ప్రయాణాలు చేయాల్సినవారు బస్సుల్లోకి ప్రవేశించడానికి చాలా కష్టపడవలసి వస్తుంది. సాయంత్రం వేళల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. రోజూ వచ్చిపోయే విద్యార్థులు, ఉద్యోగ వర్గాలవారు, వివిధ అవసరాల నిమిత్తం నగరానికి వచ్చేవారు ఇళ్లకు తిరిగి చేరుకునేందుకు కాంప్లెక్స్‌కు వస్తున్నారు. కాంప్లెక్స్ పరిసరాల్లో ఎక్కువ విద్యాసంస్థలు ఉండడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు రావడంతో ఆ ప్రాంతం బహిరంగ సభను తలపిస్తోంది. అసలే జనసందోహం. దీనికితోడు బస్సు ప్లాట్‌ఫామ్‌లో ఆగకముందే ప్రయాణికులు సీట్ల కోసం రన్‌వే మీదకు వచ్చేస్తుండడంతో ఎక్కడ ప్రమాదాలు సంభవిస్తాయోనని కొందరు అధికారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆర్టీసీ సిబ్బంది రన్‌వేపైకి చేరుకొని ప్రయాణికులు, విద్యార్థులను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నా ఎలాంటి ఉపయోగం ఉండటం లేదు. ప్రయాణికులు ఇళ్లకు త్వరగా చేరుకోవాలనే ఆత్రుతతో బస్సు ఎక్కేటప్పుడు తీవ్ర రద్దీ, గలాటాలు జరుగుతున్నాయి. పరిస్థితి చేయి దాటకముందే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కార్తీక పూజలు ప్రారంభం


రెడ్డికంచరపాలెంలో శివుడికి పూజలు

కంచరపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా బుధవారం కంచరపాలెం పరిసర ప్రాంతాల్లోని శైవాలయాల్లో పూజలు ప్రారంభమయ్యాయి. తిక్కవానిపాలెం, గంగన్న నగర్, రెడ్డి కంచరపాలెం, గొల్ల కంచరపాలెం, తుమ్మడిపాలెం, ఐటీఐ జంక్షన్ తదితర ప్రాంతాల్లో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, విశిష్ట అలంకరణ జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కంచరపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈపీడీసీఎల్ కంచరపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు రెండోజోన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఆశవానిపాలెం, చాకలిగెడ్డ, లోకో షెడ్ తదితర ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

సీతమ్మధార పరిధిలో...

సీతమ్మధార: హెచ్‌టీ లైన్ల నిర్వహణ పనులు చేపడుతున్న నేపథ్యంలో గురువారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సీతమ్మధారలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయం, పి అండ్ టి కాలనీ, డాక్టర్ గణేష్‌బాబు ఆసుపత్రి ప్రాంతం, టీపీటీ కాలనీ, బాలయ్యశాస్త్రి లేఅవుట్, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ జోన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు మాధవధార పరిధిలో...

మాధవధార: మాధవధార ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్‌లో ఈ నెల 24న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ బి.కె. నాయుడు తెలిపారు. సెక్షన్ పరిధిలోని రహదారులను ఆనుకొని విద్యుత్ హైటెన్షన్ తీగెల్ని తాకే చెట్ల కొమ్మల కొట్టివేత పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు. ఈ కారణంగా మాధవధార, గాంధీనగర్, అంబేడ్కర్ నగర్ సహా మర్రిపాలెం రైతుబజార్, ఎన్ఏడీ కొత్త రోడ్డు, సాకేతపురం ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

25న 'మట్టిమనిషి' నాటక ప్రదర్శన

డాబాగార్డెన్స్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రచయిత్రి డా.వాసిరెడ్డి సీతాదేవి రచనల్లో తలమానికంగా నిలిచిన 'మట్టిమనిషి' నాటక ప్రదర్శనను అభ్యుదయ రచయితల సంఘం, మార్క్సిస్టు అధ్యయన కేంద్రం విశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25న ప్రదర్శించనున్నట్టు అరసం ప్రధాన కార్యదర్శి యు.అప్పలరాజు తెలిపారు. నాటక ప్రదర్శన పోస్టర్‌ను బుధవారం పి.నాగమల్లేశ్వరరావు, బుసుపోతన, శ్యామ్‌సుందర్ ఆవిష్కరించారన్నారు. 25న సాయంత్రం 5.45 గంటలకు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నాటక ప్రదర్శన ప్రారంభమవుతుందన్నారు. అభిమానులు, కళా సంస్థల ప్రతినిధులు, ఔత్సాహికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అక్రమ నిర్మాణం పరిశీలన

మాధవధార, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 51వవార్డు ఏకలవ్యకాలనీలో పాత ఇంటిని తిరిగి నిర్మిస్తున్న క్రమంలో దాదాపు 10 గజాలు ఆక్రమించి కడుతున్నారన్న ఫిర్యాదుపై తహసీల్దారు కార్యాలయ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ విభాగాలు అక్కడికి వెళ్లారు. తహసీల్దారు వి.రమేష్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్మాణదారుడికి స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు గ్రేడ్-1 వీఆర్వో నిర్మల తెలిపారు. ఇటీవల రెండు వర్గాలుగా విడిపోయిన కాలనీ వాసులు ఫిర్యాదులు చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం అక్రమ నిర్మాణాన్ని తొలగించడానికి వెళ్లిన వారిని సైతం ఓ వర్గం అడ్డుకున్నట్లు వీఆర్వో పేర్కొన్నారు. కాలనీ పూర్తిగా ఆక్రమిత ప్రాంతంగా ఉండటంతో ఎవరికీ పట్టాలు, రిజిస్ట్రేషన్ విధానాలు లేవు. కాలనీ వాసులే ఆధిపత్యం కోసం తగాదాలు పడుతున్నట్లు తహసీల్దారు కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాద వితరణ


అన్నప్రసాద వితరణ చేపడుతున్న ఎంపీ శ్రీభరత్

అక్కయ్యపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీపూర్ణ పుష్కల అయ్యప్ప సేవా ట్రస్ట్ వ్యవస్థాపకుడు, అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్ట్ చైర్మన్ పైలా ఆదిమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం శంకర మఠంలో భక్తులకు ఉచిత అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశాఖ ఎంపీ శ్రీభరత్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో 25 ఏళ్లుగా అయ్యప్ప మాలధారణ రోజుల్లో భక్తులకు ఉచిత అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ చైర్మన్ ఆదిమోహన్‌రెడ్డి మాట్లాడుతూ జనవరి 1 వరకూ ప్రతి రోజు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శంకరమఠం అధ్యక్షుడు డాక్టర్ టీవీ రవిరాజు, కార్యదర్శి అచ్యుతరామయ్య, ఎం.కృష్ణయ్య, ఎస్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైర్లెస్ కాలనీలో...

జ్ఞానాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిహరాత్మజ అన్నదాన చారిటబుల్ ట్రస్ట్, కోదండరామ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైర్లెస్ కాలనీ కోదండ రామాలయంలో మాలధారణ భక్తులకు మండలకాల మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని డీఆర్ఎం లలిత్ బొహ్రా ప్రారంభించారు. డిసెంబరు 1 వరకు కొనసాగుతుందని టస్ట్ అధ్యక్షుడు కంచుమూర్తి వెంకటరమణమూర్తి తెలిపారు. రోజూ 1500 మంది స్వాములకు ప్రసాద వితరణ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, ట్రస్ట్ వ్యవస్థాపకులు కడగల శ్రీను, కె.సుబ్రహ్మణ్యం, కె.శ్రీనివాస్, సభ్యులు కోరాడ అప్పారావు, రామకృష్ణారెడ్డి, పి.అవతార్ స్వామి పాల్గొన్నారు.


వైర్లెస్ కాలనీలో డీఆర్ఎం లలిత్ బొహ్రా

విద్యతోనే మెరుగైన జీవితం: సీపీ బాగ్చి


బాలబాలికలకు నూతన వస్త్రాలు అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి, డి.ఎస్.ఆనంద్ తదితరులు

డాబాగార్డెన్స్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే మెరుగైన జీవితం, సమాజంలో పేరు ప్రఖ్యాతులు లభిస్తాయని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. డాబాగార్డెన్స్, సీతమ్మధారలోని పాపాహోమ్‌లలో ఆశ్రయం పొందుతున్న బాలబాలికలకు సూర్యాబాగ్‌లో బుధవారం నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. దాతలను అభినందించారు. ముఖ్య అతిథిగా హాజరైన మెరైన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ డి.ఎస్.ఆనంద్ అర్ధాంగితో కలిసి నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాపాహోమ్ కమిటీ సభ్యులు డి. సూర్యప్రకాశరావు, పంపాన వెంకటేశ్వరరావు, రమేష్ చంద్‌జైన్, ఇందిరా పట్నాయక్ పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీ నిర్మాణానికి వినతి


ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ శ్రావణి

అక్కయ్యపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డులో నూతన ప్రజారోగ్య కేంద్రాన్ని (యూపీహెచ్‌సీ) నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ ముక్కా శ్రావణి, టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్‌లు ఎంపీ శ్రీభరత్‌ను కోరారు. ఆయన క్యాంప్ కార్యాలయంలో ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. వార్డులోని కూరగాయల మార్కెట్ భవనంపైన మరో అంతస్తు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగాలకు 55 మంది ఎంపిక


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మంజుల

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం మినీ క్యాంపస్ డ్రైవ్ జరిగింది. జవహర్ నాలెడ్జ్ సెంటర్, నిర్మాణ్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో ఎక్స్‌టీ గ్లోబల్, టాటా ఎలక్ట్రానిక్స్, ప్రీమియర్ సంస్థలకు చెందిన ప్రతినిధులు విద్యార్థినులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కళాశాలలో తృతీయ సంవత్సరం పూర్తి చేసుకునే 105 మంది విద్యార్థినులు హాజరు కాగా 55 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ విద్యార్థినులు విద్యతోపాటు ఉపాధి నైపుణ్యాలు మెరుగుపరుచుకుని ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల జేకేసీ కో-ఆర్డినేటర్ ఎం.విద్యాకల్పన, వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, డాక్టర్ టీఎంఎ నివేదిత, డాక్టర్ ఆర్.కిరణ్మయి, ప్రైవేటు సంస్థల ప్రతినిధులు మహేష్, వేణుగోపాల్, ప్రియాంక, చైతన్య పాల్గొన్నారు.

వైద్య కళాశాలలపై వైసీపీ సంతకాల సేకరణ


జ్ఞానాపురం ప్రాంతంలో సంతకాలు సేకరిస్తున్న కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, ఇతర మహిళా నాయకులు

జ్ఞానాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో నిర్వహించే అంశాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ నాయకులు బుధవారం సంతకాలు సేకరించారు. జ్ఞానాపురం ప్రాంతంలో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఇంటింటికీ వెళ్లి గవర్నర్ పేరిట రాసిన లేఖపై సంతకాలు చేయించారు. ఈ అంశంపై ప్రజలు సానుకూలంగా స్పందిస్తున్నారన్నారు. మహిళా నాయకులు ఆదిలక్ష్మి, మేరీ, మణి, మంగ, ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

మాధవధార: కళింగనగర్ ప్రాంతంలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యంలో వైద్య కళాశాలలపై ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. స్థానిక నాయకులు పైడి శ్రీనివాసరావు, తాటిపూడి రత్న, రామారావు, నాగలక్ష్మి పాల్గొన్నారు. గురువారం మురళీనగర్ ప్రాంతాల్లో కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు 50వ వార్డు కార్పొరేటర్ వి.ప్రసాద్ తెలియజేసారు. ప్రజలంతా కార్యక్రమంలో భాగమై ప్రైవేటీకరణ వలన మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య దూరమయ్యే ప్రమాదాన్ని అడ్డుకోవాలని కోరారు.

గోతులమయంగా పట్టాభిరెడ్డితోట సీసీ రోడ్లు


ఆర్టీసీ బస్టాపు ఎదుట కుంగిన రోడ్డు

మురళీనగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 49వవార్డులో రహదారులు దెబ్బతినడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పట్టాభిరెడ్డితోట నుంచి పాలిటెక్నిక్ ప్రహరీగోడను ఆనుకొని ఉన్న సిమెంటు రహదారి గోతులమయమైంది. మురళీనగర్ మెయిన్‌రోడ్డులో సెక్టర్ 8 ఆర్టీసీ బస్టాపు వద్దే తారురోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కుంగిపోయింది. రహదారి అంచున రోడ్డు కూరుకుపోవడంతో వాహనదారులు గోతుల్లో పడకుండా షాపుల నిర్వాహకులే రాళ్లతో నింపి, కర్రలు పాతారు. వార్డు ఇంజనీరింగ్ విభాగం అధికారులుగానీ, ప్రజాప్రతినిధులు గానీ ఇటుగా చూడటం లేదని ప్రయాణికులు, రోడ్ల వెంబడి ఉన్న దుకాణాల నిర్వాహకులు వాపోతున్నారు. అధికారులు రోడ్ల మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

మరింత సమర్థంగా ఆహార భద్రతా విభాగం

... 5వ పేజీ తరువాయి

రావడంతో సమీక్షించాం. ఆహారంలో రంగుల వినియోగంపై ప్రజలను అప్రమత్తం చేయాలని విభాగాన్ని ఆదేశించాం' అని రఘురామ పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఫిర్యాదుల కమిటీ సభ్యులు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పి.విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆహార భద్రతా విభాగం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ప్రమాదకర రంగులు వాడే దుకాణాలను మూయించండి

» రోడ్డు పక్క దుకాణాల్లో ఆహార పదార్థాల తనిఖీలో అధికారులకు ఎమ్మెల్యే సూచన


ఆహార పదార్థం వాసన చూస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాల్లో హానికరమైన రంగులు వాడుతున్న దుకాణాలను వెంటనే మూసివేయించాలని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అధికారులను ఆదేశించారు. ఆహార పదార్థాలు ప్రజల ఆరోగ్యానికి చేటు తెచ్చేలా ఉండకూడదని పేర్కొన్నారు. సీతమ్మధారలోని పలు ప్రాంతాల్లో ఫుడ్ కోర్టు దుకాణాలను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి బుధవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. రంగులు, ఇతర ప్రమాదకరమైన పదార్థాలు వాడుతున్న దుకాణదారులపై చర్యలుతీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఆయనపై ఆరోపణలు అనేకం

... 5వ పేజీ తరువాయి

నగర్‌లో అంబేడ్కర్ విగ్రహం తొలగింపు వివాదంలో తనకు కలెక్టర్ షోకాజ్ నోటీస్ జారీచేయడం వెనుక డీఆర్వో ప్రమేయం ఉందని ఆర్డీఓ శ్రీలేఖ అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే డీఆర్వో అవినీతిపై ఆమె కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. అంతకుముందు అంటే ఎనిమిది నెలల క్రితం కూడా తనను డీఆర్‌ఓ వేధిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్టు సమాచారం.

పార్కులో ఎట్టకేలకు మరమ్మతులు

కంచరపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 54వ వార్డు పరిధి జాతీయ రహదారి అచ్చిబాబు ఫంక్షన్ హాల్ వద్ద గ్రీన్‌బెల్ట్ పార్కులో అధికారులు ఎట్టకేలకు మరమ్మతులు ప్రారంభించారు.గతంలో ఇక్కడ గ్రీన్‌బెల్ట్‌లో వాకింగ్ ట్రాక్ నిర్మించి బెంచీలు ఏర్పాటు చేశారు. ఆ బెంచీలు విరిగిపోవడం, వాకింగ్ ట్రాక్ మరమ్మతులకు గురికావడంతో స్థానికులు ఇబ్బంది పడేవారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం సమయాల్లో పార్కుకు పిల్లలు, వృద్ధులు, మహిళలు అధికంగా వస్తుండడంతో దీనిని ఉపయోగకరంగా ఉండేలా తీర్చిదిద్దాలని స్థానికులు ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు విజ్ఞప్తి చేశారు. ఆయన ఆదేశాల మేరకు రూ.19 లక్షలతో పెద్దలు వ్యాయామం చేసుకోవడానికి జిమ్ ఏర్పాటు చేస్తారు. మరో రూ.9 లక్షలతో పార్కులో కొత్తగా 15 విద్యుద్దీపాల ఏర్పాటు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. వారం రోజులుగా జరుగుతున్న పనులను బుధవారం బీజేపీ వార్డు అధ్యక్షుడు రంగుముద్ర రాంబాబు, చల్లా వెంకటేష్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. పనుల్లో నాణ్యతపై ఆరా తీసి త్వరితగతిన పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు.


గ్రీన్‌బెల్ట్ పార్కులో పనులు చేపడుతున్న దృశ్యం

తిరుపతి రైళ్లు ఫుల్

.. 5వ పేజీ తరువాయి

ఎక్స్‌ప్రెస్, ప్రతి ఆది, బుధవారాల్లో అందుబాటులో ఉండే బిలాస్‌పూర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్ (17481) రైళ్లకు నవంబరులో బెర్తులు లభించే పరిస్థితి ఉంది.

వారాంతపు, బైవీక్లీ రైళ్లకు తీవ్ర డిమాండ్

విశాఖ మీదుగా నడిచే వారాంతపు, బైవీక్లీ రైళ్లకు కూడా తీవ్ర డిమాండ్ ఏర్పడింది. ప్రతి శనివారం నడిచే భువనేశ్వర్-తిరుపతి (22879) ఎక్స్‌ప్రెస్‌కు డిసెంబరు 20 వరకు, అలాగే ప్రతి ఆదివారం భువనేశ్వర్‌లో బయలుదేరి విశాఖ మీదుగా తిరుపతి వెళ్లే భువనేశ్వర్-తిరుపతి (22871) ఎక్స్‌ప్రెస్‌కు డిసెంబరు 21 వరకు బెర్తులు నిండిపోయి నిరీక్షణ జాబితా ఏర్పడింది. ఖరగ్‌పూర్-విల్లుపురం (22603), సంత్రాగచ్చి-మంగళూరు వివేక్ ఎక్స్‌ప్రెస్ (22815), భగల్‌పూర్-బెంగళూరు అంగా ఎక్స్‌ప్రెస్ (12254), షాలిమార్-నాగర్‌కోయిల్ గురుదేవ్ ఎక్స్‌ప్రెస్ (12660). పురిలియా-విల్లుపురం (22605), హటియా-బెంగళూరు (18637), భువనేశ్వర్-బెంగళూరు (12845), హౌరా-తిరుపతి హంసఫర్ (20889), సంత్రాగచ్చి-తిరుపతి (22855), హౌరా-పాండిచ్చేరి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12867) రైళ్లకు తీవ్ర డిమాండ్ ఏర్పడింది.

షిర్డీ రైలుకు నవంబరు 20 వరకూ బెర్తులు ఫుల్

విశాఖ నుంచి ప్రతి గురువారం బయలుదేరే సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ (18503)లో నవంబరు 20 వరకూ బెర్తులు రిజర్వు అయిపోయాయి. నవంబరు 27 నుంచి డిసెంబరు 18 వరకు బెర్తులు లభ్యమవుతున్నాయి. వారానికి ఒక్కరోజు మాత్రమే ఈ రైలు అందుబాటులో ఉన్న నేపథ్యంలో షిర్డీ ఎక్స్‌ప్రెస్‌కు ఆక్యుపెన్సీ పెరుగుతోంది. షిర్డీ వెళ్లేవారికి ప్రత్యామ్నాయంగా విశాఖ-ఎల్‌టీటీ వయా సికింద్రాబాద్ (18519), విశాఖ-ఎల్‌టీటీ వయా రాయగడ (22847), కోణార్క్ (11020) ఎక్స్‌ప్రెస్ రైళ్లలో మన్మాడ్ వరకు వెళ్లే అవకాశం ఉన్నా ఎక్కువగా సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్‌కే ప్రాధాన్యమిస్తారు. ఈ నేపథ్యంలో షిర్డీ ఎక్స్‌ప్రెస్‌ను బైవీక్లీగా నడపాలని డిమాండ్ చాలాకాలంగా ఉంది.

దువ్వాడ మీదుగా ఎర్నాకులం నుంచి బరౌనికి నేడు ప్రత్యేక రైలు

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ మీదుగా ఎర్నాకులం నుంచి బరౌనికి (ఒకవైపు మాత్రమే) గురువారం (23న) ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. 06183 నంబరు గల రైలు గురువారం ఉదయం 10 గంటలకు ఎర్నాకులంలో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 2.50 గంటలకు దువ్వాడ చేరుతుంది. తిరిగి 2.55 గంటలకు బయలుదేరి విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు మీదుగా శనివారం రాత్రి 8 గంటలకు బరౌని చేరుతుందని పేర్కొన్నారు. ఈ రైలుకు ఆరు థర్డ్ ఏసీ, 12 స్లీపర్, రెండు సెకెండ్ క్లాసు కమ్ లగేజి కమ్ దివ్యాంగుల కోచ్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మళ్లింపు మార్గంలో హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్

విశాఖ-అమృత్‌సర్ మధ్య నడిచే హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ (20807) ఖుర్దారోడ్డు డివిజన్‌లో పవర్ బ్లాక్ పనులు చేపడుతున్న నేపథ్యంలో ఈ నెల 24, 25 తేదీల్లో తాల్చేర్ స్టేషన్‌కు వెళ్లకుండా తాల్చేర్ రోడ్డు మీదుగా అమృత్‌సర్‌కు చేరుకుంటుందని రైల్వే అధికారులు తెలిపారు. తిరుగు ప్రయాణంలో అమృత్‌సర్-విశాఖ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ (20808) ఈ నెల 25న తాల్చేరు స్టేషన్‌కు చేరకుండా వయా తాల్చేరు రోడ్డు మీదుగా విశాఖకు వస్తుందని పేర్కొన్నారు.

రాజకీయ ప్రయోజనం కోసమే గూగుల్‌పై అసత్య ప్రచారం

... 5వ పేజీ తరువాయి

తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. స్వప్రయోజనాలు, స్వలాభాల కోసం ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. విపక్షాలు నిర్మాణాత్మక పాత్ర పోషించాలని, వీలైతే ప్రజలకు అవగాహన కల్పించాలి తప్ప రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుదోవ పట్టించకూడదన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి సమపాళ్లలో ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకువెళుతుందన్నారు. పార్టీ నాయకులంతా పరిశ్రమల ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలకు ప్రజలకు వివరించాలన్నారు.

వైఎస్ హయాంలో బ్రాండిక్స్‌కు ఎకరా రూపాయికే ఇచ్చారు


అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

గూగుల్ రాకతో విశాఖకు మరికొన్ని కంపెనీలు వస్తాయని అనకాపల్లి శాసనసభ్యుడు కొణతాల రామకృష్ణ అన్నారు. బుధవారం శాసనసభా ఫిర్యాదుల కమిటీ సమీక్షకు హాజరైన ఆయన అనంతరం కలిసి విలేకరులతో మాట్లాడుతూ అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ, విశాఖలో టీసీఎస్, మరికొన్ని కంపెనీల ఏర్పాటుతో రాష్ట్రంలో ఐటీ రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. విశాఖలో టీసీఎస్‌కు ఎకరా 99 పైసలకే ఇచ్చారని తప్పుబడుతున్నారని, రాజశేఖర్‌రెడ్డి హయాంలో అచ్యుతాపురంలో బ్రాండిక్స్ కంపెనీకి ఎకరా రూపాయికే ఇచ్చారని కొణతాల గుర్తుచేశారు.

...అయితే ఓకే

... 5వ పేజీ తరువాయి

వినిపిస్తున్నాయి. అలాగే గిరి ప్రదక్షిణ సందర్భంగా 120 లీటర్ల సామర్థ్యం కలిగిన 570 ప్లాస్టిక్ డ్రమ్ములను రూ.1,200 చొప్పున, 200 లీటర్ల సామర్థ్యం కలిగిన వంద డ్రమ్ములను రూ.రెండు వేల చొప్పున కాంట్రాక్టర్ కొనుగోలు చేశారంటూ బిల్లు చెల్లింపు అంశాన్ని అజెండాలో ప్రతిపాదించగా కమిటీ సభ్యురాలు సాడి పద్మారెడ్డి అభ్యంతరం తెలిపారు. తనకు డ్రమ్ముల వ్యాపారంలో అనుభవం ఉందని, డ్రమ్ములను అద్దెకు తీసుకుంటే ఒక్కో దానికి రూ.50 నుంచి రూ.వంద ఖర్చు అవుతుందని, అలాంటిది ఏకంగా రూ.రెండు వేలు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఒకవేళ కొనాలనుకున్నా 120 లీటర్ల డ్రమ్ములను రూ.700కి, 200 లీటర్ల డ్రమ్ములను రూ.800కి సరఫరా చేసేవారున్నారని చెప్పారు. అంత మొత్తం ఖర్చు పెట్టి కొనుగోలు చేసిన 670 డ్రమ్ములు ఇప్పుడు ఎక్కడున్నాయని ఆమె ప్రశ్నించారు. ఇదంతా అడ్డగోలు దోపిడీయేనని, ఆ అంశాన్ని తిరస్కరించాలని మేయర్‌ను కోరారు. దీంతో ఆ అంశాన్ని వాయిదా వేస్తున్నట్టు మేయర్ ప్రకటించారు. కొంతసేపటి తర్వాత ఆయా అంశాలపై సంబంధిత అధికారి వివరణ ఇస్తానని కోరగా, సభ్యులు సరేనని అనుమతించడంతోపాటు డ్రమ్ముల ఫొటోలు చూపించాలనే షరతుపెట్టి ఆమోదించేస్తున్నట్టు ప్రకటించడం ఆశ్చర్యం కలిగించింది. జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి అంశానికి ఆమోదం తెలిపే వ్యవహారంలో కూడా మేయర్ పేషీలోని ఒక ప్రైవేటు వ్యక్తి రూ.పది వేలు చొప్పున వసూలు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్ని అంశాలను గుడ్డిగా ఆమోదించడంలో అంతర్యమేమిటని స్టాండింగ్ కమిటీలోని ఒక సభ్యుడిని ప్రశ్నించగా...మేయర్ పేషీలోని ఒక ప్రైవేటు వ్యక్తి ఒత్తిడి చేయడంతోనే తాము నోరెత్తలేకపోతున్నామని వాపోయారు.

ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందాలి

... 5వ పేజీ తరువాయి

అధికారులను ఆదేశించింది. ఈ క్రమంలో కేజీహెచ్‌లో హీమోఫీలియా వ్యాధిగ్రస్తులకు అందుతున్న సేవలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు చేపడుతున్న చర్యలు, ఎన్టీఆర్ వైద్య సేవలపై కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కమిటీ సభ్యులు పలు సూచనలిచ్చారు. హీమోఫీలియాతో వస్తున్న వారికి తక్షణ సాయం అందించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రూ.48 వేలకు తగిన మందులు ఇవ్వాలన్నారు. డే కేర్ కేటగిరీలో వైద్య సేవలు అందించాలని కమిటీ చైర్మన్ సూచించారు. అంగవైకల్యం ధ్రువపత్రాలు అందించేందుకు ఉన్నతస్థాయిలో చర్చించి చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖ డిప్యూటీ సెక్రటరీ శోభికను చైర్మన్ ఆదేశించారు. అనకాపల్లి జిల్లాలో 53 కేసులున్నాయని, వారికి వైద్య సేవలు అందుతున్నాయని సంబంధిత అధికారులు వివరించారు.

అనంతరం ఫుడ్ సేఫ్టీ విభాగంలో జరుగుతున్న కార్యకలాపాలు, చేపడుతున్న చర్యలపై కమిటీ సమీక్షించింది. స్టార్ హోటల్ మొదలుకొని వీధుల్లోని చిన్న హోటళ్ల వరకు ఆహారం కల్తీ జరుగుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు అప్రమత్తంగా ఉంటే ప్రజారోగ్యానికి భరోసా లభిస్తుందని డిప్యూటీ స్పీకర్ అన్నారు. ఇటీవల కురుపాం వసతిగృహంలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా విస్తృత తనిఖీలు, పరీక్షలు నిర్వహించాలన్నారు. ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో కలర్స్ వాడకుండా చర్యలు తీసుకోవాలని, చికెన్, మటన్ తనిఖీలు చేపట్టాలన్నారు. సిబ్బంది కొరత గురించి ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రస్తావించగా సచివాలయాల్లో విద్యార్హతలున్న వారిని వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలను ప్రభుత్వానికి నివేదిస్తామని, సకాలంలో ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. మూడు నెలలకొకసారి విశాఖ వేదికగా సమావేశం నిర్వహిస్తామని చైర్మన్ తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, కొణతాల రామకృష్ణ, కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, శాసనసభ డిప్యూటీ సెక్రటరీ కె.రాజాకుమార్, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

'ఉక్కు'ను సెయిల్‌లో విలీనం చేయాలి

» ఇంటక్ చీఫ్ ప్యాట్రన్ మంత్రి రాజశేఖర్

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం ఉపసంహరించుకోవడంతో పాటు సెయిల్‌లో విలీనం చేయాలని ఇంటక్ చీఫ్ ప్యాట్రన్ మంత్రి రాజశేఖర్ కోరారు. ఇక్కడి యూనియన్ కార్యాలయంలో బుధవారం రాత్రి జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు ఉద్యోగులకు యాజమాన్యం సకాలంలో వేతనాలు ఇవ్వాలని, పెండింగ్ జీతాలను చెల్లించాలన్నారు. నిలిపివేసిన కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను పునరుద్ధరించాలని పేర్కొన్నారు. సమావేశంలో అధ్యక్షుడు పీవీ రమణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రాజు, నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కె.వెంకన్న, ఎం.అప్పలరాజు, ఎస్‌ఏ నాయుడు, సాహూ, గోపాలకృష్ణ, ఈశ్వరరావు, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అగనంపూడి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి సెక్షన్ కార్యాలయ పరిధిలో గల మంగళపాలెం 33/11 కేవీ సబ్ స్టేషన్, ఇండోర్ సబ్ స్టేషన్ లైన్లలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా డొంకాడ, కొండయ్యవలస, సాయినగర్, దానబోయినపాలెం, తలారివానిపాలెం, అండమాన్ కొండయ్యవలస, ప్రాంతీయ ఆస్పత్రి, పెదమడక, పినమడక, గల్లవానిపాలెం, శనివాడ, జాబిలి హిల్స్, పాత అగనంపూడి, శాంతినగర్, దువ్వాడ సెక్టర్-1, మంగళపాలెం, జేఎన్‌ఎన్‌యూఆర్ఎం కాలనీ, వెదుళ్ల నరవ, గంగవరం, శెట్టిపాలెం, లంకివానిపాలెం, అజనగిరి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాలకు విజ్ఞాన్ విద్యార్థినుల ఎంపిక

అగనంపూడి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఇంజనీరింగ్, ఎంసీఏ విద్యార్థినులు 76 మందికి ప్రముఖ ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్‌లో పలు రకాల వార్షిక వేతనంతో కూడిన ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ అరుంధతి తెలిపారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యా బోధనతో పాటు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా విజ్ఞాన్ విద్యా సంస్థలు విద్యార్థులకు తగిన శిక్షణ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగాధిపతి మహేంద్ర సాయి, సంతోశ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శరత్, శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య, ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజి** కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి**: సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 17, టమాటా 25, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 36, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 22, క్యారెట్ 52, దొండకాయలు 38, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 68, అల్లం (పాతది) 70, బరబాటి 38, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 66, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 54, కీర దోస 22, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 48, దేముడు చిక్కుడు 76, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 22, మామిడి అల్లం 90, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

హరోం హర

» కార్తీక మాసం ప్రారంభం

» భక్తులతో కళకళలాడిన శివాలయాలు



86వ వార్డు మాతృశ్రీ నగర్ ఆలయంలో శోభాయమానంగా అలంకరించిన శివలింగం

కూర్మన్నపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎంతో పవిత్రమైన కార్తీక మాసం బుధవారం నుంచి ప్రారంభం కావడంతో మహా నగరంలోని శైవక్షేత్రాలన్నీ శివ నామస్మరణతో మార్మోగుతున్నాయి. వేకువజాము నుంచే శివాలయాల వద్ద భక్తులు బారులుతీరారు. ఇందులో భాగంగా 86వ వార్డు మాతృశ్రీ నగర్‌లోని శ్రీకాశీ అన్నపూర్ణాదేవి సమేత శ్రీవిశ్వేశ్వరాలయంలో, రాజీవ్‌నగర్, వడ్లపూడి, కణితి, సంతమామిడి తోట, తెలుకల వీధి శ్రీనగర్‌లోని శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, పంచామృతాభిషేకాలు చేశారు. సాయంత్రం పలు ఆలయాల్లో కార్తీక పురాణ శ్రవణం, లింగాష్టకం, బిల్వాష్టకం, భజనలు, భక్తి గీతాలను ఆలపించారు.

అలాగే 87వ వార్డు వడ్లపూడిలో బ్రహ్మసూత్ర శివలింగానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పంచామృతాభిషేకాల్లో కార్పొరేటర్ బొండా జగన్ పాల్గొన్నారు. కణితి కాళింగుల వీధిలో శ్రీకార్తికేయ, శ్రీస్వర్ణాకర్షణ భైరవ, శ్రీ భువనేశ్వరీదేవి సహిత శ్రీపంచముఖేశ్వరస్వామి శివాలయంలో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. 70వ వార్డు చట్టివానిపాలెంలో శ్రీబాల త్రిపురసుందరి అమృతలింగేశ్వరస్వామి ఆల యంలోని స్వామివారికి పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం స్వామివారిని వెండి నాగాభరణం, పూలమా లలు, ఆభరణాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఆటోనగర్‌లోని దుర్గామల్లికార్జునస్వామి ఆలయంలో జరిగిన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అగనంపూడి: గ్రేటర్ 79, 85 వార్డుల పరిధిలో గల శివాలయాల్లో కార్తీక మాస పూజలను వైభవంగా ప్రారంభించారు. జాబిలి హిల్స్‌లో గల శ్రీఉమారామ లింగేశ్వరస్వామి ఆలయం, పెదమడక ఉమామహేశ్వరాలయం, పాత అగనంపూడి లింగాల తిరుగుడి ఆలయంలో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు చేశారు. పలు ఆలయాల్లో సాయంత్రం విష్ణుసహస్రనామ, కార్తీక నామం, హనుమాన్, బాబా చాలీసా పారాయణాన్ని పఠించారు.



87వ వార్డు కణితి పంచముఖేశ్వరాలయంలో అభిషేకాలు అందుకున్న పరమశివుడు

అక్కిరెడ్డిపాలెం: కార్తీక మాసం తొలిరోజు షీలానగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంతో పాటు తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం అయ్యప్ప భక్తుల శరణు ఘోషతో మార్మోగాయి. అయ్యప్పస్వామి ఆలయంలో వైద్యనాథన్ ఆధ్వర్యంలో వేదపండితులు స్వామివారిని పంచామృతాలతో అభిషేకించి, ప్రత్యేక పువ్వులు, నగలతో అలంకరించి పూజలు చేశారు. మణికంఠ జ్యోతి భక్త సేవా సంఘం ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి కూడా అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రీవారి పూజల్లో పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలి

» డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు

పెదగంట్యాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించి జాతీయ స్థాయికి ఎదగాలని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు ఆకాంక్షించారు. నడుపూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు జరిగే డివిజనల్ స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడా రంగాన్ని ఎంతో ప్రోత్సహిస్తుందని, అందుకు అవసరమైన నిధులను కేటాయిస్తుందన్నారు. పాఠశాల హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ డివిజనల్ స్థాయిలో జరుగుతున్న ఈ క్రీడా పోటీల్లో ఆరు మండలాలకు సంబంధించిన 720 మంది విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, చెస్, బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తు న్నామని పేర్కొన్నారు. డివిజనల్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, ఎంఈవో కె.రమణాజీ, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రవి, శ్రావణి, షమీమ్, కూటమి నాయకులు పులి వెంకటరమణారెడ్డి, కిలాని ముసలయ్య, మంత్రి గోపి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు

'అంబుజా' ప్రతిపాదనలను రద్దు చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్

గాజువాక, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ ప్రాంతంలో అదానీ గ్రూప్ అంబుజా సిమెంటు కంపెనీ నిర్మాణ ప్రతిపాదనలను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్ డిమాండ్ చేశారు. పెదగంట్యాడలో సిమెంటు కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ బుధవారం గాజువాకలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కాలుష్యంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ క్రమంలో ఇక్కడ కాలుష్య భరితమైన సిమెంటు కంపెనీ ఏర్పాటుకు ప్రయత్నాలు చేయడం భావ్యం కాదన్నారు. ఇప్పటికే ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకోవడం ద్వారా ప్రజలు నిరసనను వ్యక్తం చేశారని, మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ చేస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వం గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాయుడు, మహేశ్, రాజు, మౌనిక, శశిరాము, విశ్వహేమ, భారతి, కావ్య, సూర్య, తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గాజువాకలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రిటైనింగ్ వాల్‌కు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ గల్లా పోలిపల్లి

సింధియా, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 63వ వార్డు జైంద్రకాలనీ కొండవాలు ప్రాంతంలో సుమారు రూ.15లక్షల కార్పొరేషన్ నిధులతో నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్‌కు వార్డు కార్పొరేటర్ గల్లా పోలిపల్లి(చిన్నా) బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ప్రయోజనాల కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ వార్డు అధ్యక్షుడు జెర్రిపోతుల నర్సింగరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

నష్టపరిహారం కోసం ఆందోళన



ఆందోళన చేస్తున్న బాధితులు

పెందుర్తిరూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గోపాలపట్నం నార్త్ సింహచలం రైల్వే స్టేషన్ నుంచి పెందుర్తి కేబిన్ వరకు చేపట్టిన అదనపు రైలు ట్రాక్ నిర్మాణంలో భాగంగా వ్యవసాయ భూములు, నివాసాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు కోల్పోతున్న వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బుధవారం చింతలఅగ్రహారం రైలు గేటు వద్ద బాధితులు నిరవధిక ఆందోళన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భగా పలువురు బాధితులు మాట్లాడుతూ తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన శిబిరాన్ని కొనసాగుతుందని హెచ్చరించారు. అనంతరం మాజీ సర్పంచ్ పి.వెంకటరమణ మాట్లాడుతూ సింహాచలం దేవస్థానాన్ని సాకుగా చూపించి ప్రభుత్వం తమకు పరిహారం ఎగ్గొట్టడానికి చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు పరిహారంతో పాటు రైల్వే శాఖలో ఉపాధి కల్పించాలని మాజీ ఉప సర్పంచ్ గల్లా వెంకటరమణ అన్నారు. ఈ కార్యక్రమంలో బాధిత సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కాలభైరవ విగ్రహప్రతిష్ఠ రేపు

పెందుర్తిరూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగాడి గ్రామంలో ఉన్న శ్రీస్ఫటిక శివ లింగేశ్వర సమేత స్వర్ణాకర్షణ కాలభైరవ దేవాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా విశ్వసాయి గురూజీ సంకల్పంతో బ్రహ్మశ్రీ దార్లపూడి సంతోశ్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు రుద్ర తిశూల, నాగ శ్రీదత్తాత్రేయ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్టు తెలపారు.

బీఆర్‌టీఎస్ కాలువలో ముమ్మరంగా పూడికతీత

» సహకరించని దుకాణదారులు

» ఫలితంగా తూతూ మంత్రంగా పనుల నిర్వహణ



దుకాణం ఎదుట పూడిక తీస్తున్న దృశ్యం

గోపాలపట్నం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): దశాబ్ద కాలంగా పూడికతీతకు నోచుకోని బీఆర్‌టీఎస్ రహదారిలోని ప్రధాన డ్రైనేజీల్లో ఎట్టకేలకు పూడిక తీత పనులు చేపడుతున్నారు. అయితే ఈ పనులకు పలు దుకాణ యజమానులు సహకరించపోవడంతో తూతూ మంత్రంగా పనులు సాగుతున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. పెందుర్తి బీఆర్‌టీఎస్ కారిడార్ నిర్మాణం జరిగి దాదాపు పదిహేనేళ్లు ముగుస్తోంది. అయితే బీఆర్‌టీఎస్ రహదారికి ఆనుకుని నిర్మించిన కాలువల్లో ఇప్పటి వరకూ పూడికతీత పనులు చేపట్టలేదు. దీంతో ఈ కాలువలు పూడికతో నిండిపోయాయి. పలుచోట్ల కాలువల నుంచి దుర్వాసన రావడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో పూడికతీత పనులు చేపట్టడానికి జీవీఎంసీ సిబ్బంది చర్యలు చేపట్టారు. కొద్ది రోజుల నుంచి గోపాలపట్నం ప్రధాన రహదారిలో ఈ పూడికతీత పనులు జరుగుతున్నాయి. అయితే పూడికతీత పనుల్లో భాగంగా కాలువపై ఉన్న పలకలను తొలగించి పనులు చేస్తున్నారు. దీంతో తమ వ్యాపారాలకు ఆటంకం కలుగుతోందని పలువురు వ్యాపారులు ఈ పనులకు ఆటంకం కలిగిస్తున్నారు. దీంతో జీవీఎంసీ సిబ్బంది తూతూ మంత్రంగా పూడికతీత పనులు జరుపుతున్నారు. ఫలితంగా వర్షాలు కురిసే సమయంలో వర్షపు నీరు సజావుగా ప్రవహించకపోవడంతో రహదారులపై వర్షం నీరు నిలిచిపోతోంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి పూడికతీత పనులు పూర్తిస్థాయిలో జరిగే విధంగా చర్యలు చేపడితే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు.

ఆక్రమణలకు రెవెన్యూ అడ్డుకట్ట

» 30 పాకలను తొలగించిన సిబ్బంది

పెందుర్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కార్మికనగర్ సమీపంలో ఉన్న చెరువు ఆక్రమణకు రెవెన్యూ అడ్డుకట్ట వేసింది. ఇక్కడి సర్వే నంబరు 163లో ఉన్న చెరువు స్థలాన్ని కొంతమంది ఆక్రమించి ఆవాసాలు ఏర్పాటు చేశారు. పేదలను మధ్యపెట్టి దళారులు ఈ స్థలాన్ని ఆక్రమించి విక్రయించుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో తహశీల్దార్ వెంకట అప్పారావు ఈ స్థలాన్ని బుధవారం సందర్శించి అందులో ఉన్న పాకలు, షెడ్లను పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన ఈ స్థలంలో వెలసిన 30 పాకలను తొలగించారు. 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉచితంగా వంద గజాల స్థలాన్ని క్రమబద్ధీకరణ చేయడంతో కొంతమంది పేదలకు పట్టాలు వచ్చాయి. దీంతో కొంత మంది కబ్జా కోరులు ఈ స్థలానికి సంబంధించి తమ వద్ద పట్టాలున్నాయని ఆక్రమించి, ఇతర ప్రాంతాల వ్యక్తులు కూడా ఇక్కడ స్థలాలను ఆక్రమించినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇలా ఆక్రమించిన స్థలాలను లక్షలో విక్రయిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. పోలీసుల సహాయంతో పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగిస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

సర్దార్ పటేల్ వంతెనను ప్రారంభించాలి

» సీపీఎం నాయకుల డిమాండ్

మల్కాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): డాక్‌యార్డు సమీపంలో ఉన్న సర్దార్ వల్లభాయి వంతెన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి ప్రారంభించాలని స్థానిక రైల్వే ట్రాక్ క్రాసింగ్ వద్ద సీపీఎం నాయకులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్కాపురం జోన్ సీపీఎం కార్యదర్శి పి.పైడిరాజు మాట్లాడుతూ 9 నెలల్లో వంతెన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పి ఇంకా పూర్తి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వంతెన ప్రారంభించకపోవడం వల్ల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. డాక్‌యార్డు వంతెన మూసేయడం వల్ల మారుతి జంక్షన్ మీదుగా ఆరు కిలోమీటర్లు అదనంగా ప్రయాణం చేయవల్సి వస్తోందని అన్నారు.

రహదారి సంగతి మరిచారు!



నల్లపిక్క తేలిన రోడ్డు

పెందుర్తిరూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు తలపెట్టిన సీసీ, బీటీ రహదారుల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయకపోవడం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో అసంపూర్తిగా ఉన్న రహదారుల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని కాలనీ వాసులు వినతి పత్రాల ద్వారా కోరుతున్నా అధికారులు మాత్రం స్పందించడం లేదు. 95వ వార్డు పురుషోత్తపురం బాలాజీ నగర్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ విషయంలో అధికారుల నిర్లక్ష్య ధోరణి కనిపిస్తోందని కాలనీ వాసులు వాపోతున్నారు. బాలాజీ నగర్‌తో పాటు, హౌసింగ్ బోర్డు కాలనీ వాసుల రాకపోకలు చేసే ఈ రహదారిలో ఇప్పటికీ శిథిల రహదారే దర్శనమిస్తోంది. కాలనీ వాసుల వినతి మేరకు రహదారి నిర్మాణం కోసం స్థానిక కార్పొరేటర్ చొరవతో రూ.35 లక్షల నిధులతో టెండర్లను పిలిచి పనులు ప్రారంభించారు. ఈ నిర్మాణంలో భాగంగా ముందుగా నల్ల పిక్క వేశారు. తదుపరి పనులను చేపట్టలేదు. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నల్ల పిక్క మీద వాహనాలు ఒక పక్కకు జారిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి రహదారిని పూర్తి చేయాలని మాజీ సర్పంచ్ పిల్లల అప్పలనాయుడు వినతి పత్రాన్ని సమర్పించారు.



నిలిచిపోయిన క్లాప్ వాహనాలు

పారిశుధ్య కార్మికుల మెరుపు సమ్మె

గాజువాక, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గాజువాక జోనల్ పరిధిలో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు బుధవారం మెరుపు సమ్మెకు దిగారు. జీతాల చెల్లింపులో సంబంధిత కాంట్రాక్టరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, నెలంతా పనిచేసినా రూ.7,929 కంటే ఎక్కువ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కనీస సౌకర్యాలను కల్పించడం లేదని, దీనిపై అధికారులు స్పందించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉదయం సమ్మెకు దిగారు. దీంతో పారిశుధ్య వాహనాలు నిలిచిపోయాయి. కార్మికుల సమస్యల పరిష్కారానికి అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం ప్రారంభం

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం నుంచి ప్రారంభించారు. అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులకు డిసెంబరు ఒకటో తేదీ వరకు అన్నదానం చేస్తామని ఆలయ కమిటీ కార్యదర్శి కేఎస్ఎన్ రావు తెలిపారు. ఈ ఏడాది అయ్యప్ప స్వామి పడిపూజ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని, మాలధారణ చేసిన భక్తులకు ఆలయంలో ప్రత్యేక సౌకర్యాలను కల్పించామని పేర్కొన్నారు.

మల్టీపర్పస్ హాల్ పనులు పునఃప్రారంభం

అగనంపూడి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలసలో అసంపూర్తిగా నిలిచిపోయిన మల్టీపర్పస్ హాల్ నిర్మాణ పనులను బుధవారం కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి పునఃప్రారంభించారు. గతంలో నిధుల కొరత కారణంగా ఈ పనులను నిలిపివేశారు. తాజాగా జీవీఎంసీ నుంచి రూ.29 లక్షలు మంజూరు కావడంతో పనులను ప్రారంభించినట్టు కార్పొరేటర్ తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కూటమి నాయకులు విందుల వెంకటరమణ, ఇల్లపు ప్రసాద్, బండారు చందూరమేశ్, డి.రమేశ్, బి. గుదే సుశీలగజేంద్రరావు, బి.శ్రీను, అన్నపూర్ణ, పద్మ, గీత, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు నిర్వాసితులకు న్యాయం చేయాలని వినతి



డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన ఉక్కు నిర్వాసిత సంఘం నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ కోసం సర్వం కొల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణ, ఎమ్మెల్యేలను ఉక్కు నిర్వాసిత సంఘం నాయకులు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కలిసి విన్నవించారు. ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న నిర్వాసితులను ఇటీవల కాలంలో తొలగించారని, దీంతో నిర్వాసిత కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. తొలగించిన నిర్వాసిత కార్మికులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పీతన భాస్కరరావు, ఉమ్మడి అప్పారావు, కె.వంశీకృష్ణ, ప్రసాద్, కనకరాజు, రాంబాబు పాల్గొన్నారు.

రైతుబజార్‌ను ఏర్పాటు చేయరూ..



పశ్చిమ ఎమ్మెల్యే గణబాబుకు వినతి పత్రం అందిస్తున్న మార్కెట్ కమిటీ సభ్యులు

గోపాలపట్నం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): దువ్వాడ సమీపంలో రైతుబజారు ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబుకు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుబజార్లకు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో పారిశ్రామిక ప్రాంతంలో మరొక రైతుబజార్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే గణబాబును కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే దువ్వాడలో రైతుబజారు ఏర్పాటుపై జేసీతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎలమంచిలి అపర్ణ, వైస్ చైర్మన్ వెంకుమహంతి చంద్రశేఖర్, పలువురు డైరెక్టర్లు ఉన్నారు.

రైతుబజార్లలో దుకాణాల కేటాయింపు



డ్రా తీసి దుకాణాలు కేటాయిస్తున్న జేసీ మయూర్ అశోక్ పక్కన ఇతర అధికారులు

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతుబజార్లలో ఖాళీగా ఉన్న 120 దుకాణాలకు కలెక్టరేట్‌లో బుధవారం లాటరీ తీసి రైతులకు కేటాయించారు. రైతుల సమక్షంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ డ్రా నిర్వహించారు. కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించారని రైతులు సంతోషం వ్యక్తంచేశారు.

పబ్లిక్ నోటీస్

ఇందుమూలంగా యావన్మందికి నంబారు పోలయ్య గారి కుమారుడు చిన దేముడు, డోరు నెం. 25-4-73/2, చినదరుపూరు, ఆర్.హెచ్.కోలనీ (గొల్లపాలెం) పెదగంట్యాడ నివాసి ఇచ్చిన భోగట్టాపై తెలియజేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూలు ఆస్తి స్వర్గీయ (లేటు) నంబారు వెంకన్న గారి కుమారుడు పోలయ్యకు వారసత్వరీత్యా విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ల్యాండ్ ఎక్విజిషన్ ద్వారా పొంది అందు గత 1980 లో రెండు గదులఇల్లు నిర్మాణము చేయగా ఆయన వారసులైన (1) నంబారు చినదేముడు (మా క్లయింటు) (2) నంబారు సింహాద్రిలు 107 చదరపు గజాలలో మూడు పోర్షన్ల స్లాబ్ ఇల్లు కట్టుటకు నిర్ణయించి (గ్రౌండ్ ఫ్లోర్ నంబారు సింహాద్రి వాటాకు మొదటి ఫ్లోర్ శీర శివకృష్ణ కు చెందునట్లు గాను పెదని ఎగ్రిమెంటు చేసుకొని భవనము నిర్మించబడినదనియూ అప్పటి నుండి అనగా 2020 నుండి ఎవరికి వారి వాటాలుస్వాధీన హక్కు అనుభవములో ఉన్నవి. ఆ విధంగా మా క్లైయింటు అయిన నంబారు చినదేముడు స్వాధీన హక్కు అనుభవంలో ఉన్న ఆస్తికి మొత్తం వారే హక్కు దారులనియూ, కొంతమంది అమ్మకానికి ప్రయత్నం చేయు చున్నట్లున్నూ, అటువంటి క్రయ విక్రయాలు చెల్లనేరవు మా క్లైయింటు యొక్క హక్కులకు భంగం కలిగించవద్దనియూ మరియు అటుల జరిపిన వారు సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురనియూ హెచ్చరించడమైనది.

ఆస్తి వివరం

విశాఖపట్నం, పెదగంట్యాడ, నడుపూరు శివారు గొల్లపాలెం ఏరియా, ఆర్. హెచ్. కోలనీ, ప్లాట్ నెం.202, సర్వే నెం.42(పార్టు)లో చేరిన 107 చ.గ.లో డోరు నెం.25-4-48, ఎసెస్మెంటు నెం. 1086300007, మీటరు సర్వీసు నెం.1987 (గ్రౌండ్, ఫస్టు మరియు సెకండు ఫ్లోర్ ఆర్.సి.సి., దానిలోపలి సహిత ఆస్తికి హద్దులు.
తూర్పు: రోడ్డు, **దక్షిణం:** ప్లాట్ నెం.203 రు, **పడమర:** ప్లాట్ నెం.201రు, **ఉత్తరము:** రోడ్డు.

సైలా శ్రీనివాసరావు, పతివాడ జయకృష్ణ, కొల్లి నళిని
న్యాయవాదులు
ధనలత హాస్పిటల్ ఎదురు, బి.సి. రోడ్డు, గాజువాక, విశాఖపట్నం ఫోన్ : 9440334471

దత్తతకు దగ్గర దారి



విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సంతానం లేని దంపతుల సంఖ్య ఇటీవల కాలంలో విపరీతంగా పెరుగుతోంది. పిల్లల కోసం అన్నిరకాల ప్రయత్నాలు చేసి విఫలమైన ఎంతోమంది దత్తత వైపు మొగ్గు చూపుతుంటారు. అయితే అందుకోసం చాలాకాలం నిరీక్షించాల్సి వస్తుంది. కానీ తక్షణమే కావాలనుకునే వారికి ఆరేళ్ల వయసు నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలను దత్తత ఇచ్చేందుకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ మరో మార్గాన్ని అందుబాటులోకి తెచ్చింది. దీనినే ఫాస్టర్ అడాప్షన్ అని పిలుస్తారు. దీనికి కలిసొచ్చే కాలానికి... నడిచొచ్చే పిల్లలు' అని ట్యాగ్‌లైన్ పెట్టారు.



ఫాస్టర్ కేర్ అడాప్షన్‌తో వీలు

- ఆరేళ్లు దాటి, 18 ఏళ్లలోపు పిల్లలను దత్తత ఇచ్చే మార్గం
- రెండేళ్లపాటు పెంచి ఆ తరువాత శాశ్వతంగా దత్తత

ఎవరిని దత్తత ఇస్తారంటే.?

ఫాస్టర్ కేర్ అడాప్షన్‌లో అనాథలు, కుటుంబానికి దూర మైన (తల్లిదండ్రులు ఎవరో తెలియని పిల్లలు) వారిని దత్తత ఇస్తారు. ముందుగా సోషల్ ఇన్వెస్టిగేషన్ రిపోర్టు, పోలీస్‌స్టేషన్ నుంచి జనరల్ డైరీ రిపోర్టును తీసుకుని సదరు పిల్లలకు ఎవరూ లేరని నిర్ధారించుకున్న తరువాత ఫాస్టర్ కేర్ అడాప్షన్ కింద పిల్లలు కావాలనుకునే తల్లిదండ్రులకు దత్తత ఇస్తారు. ఈ విధానంలో పిల్లలను తీసుకునే దంపతులకు కొన్ని షరతులుంటాయి. దత్తత తీసుకోవాలని భావించే పిల్లలు సదరు కుటుంబంతో రెండేళ్లపాటు కలిసి జీవిస్తారు. ఈ రెండేళ్లలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి. దత్తత వెళ్లిన చిన్నారి వారితో ఉండేందుకు ఇష్టపడితే శాశ్వత దత్తతగా ప్రక్రియను పూర్తిచేస్తారు.

పిల్లలను దత్తత తీసుకుని లోటును పూడ్చుకునేందుకు చాలామంది దంపతులు ప్రయత్నిస్తుంటారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం కారా పేరుతో వెబ్‌సైట్‌ను నిర్వహిస్తోంది. ఇందులో పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే వారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అయితే అందుబాటులో ఉన్న పిల్లలు, నిరీక్షణ జాబితాలోని దంపతులను బేరీజు వేసుకుని ప్రక్రియ పూర్తిచేసేందుకు కొన్నేళ్లు పడుతుంది. అప్పుడే పుట్టిన చిన్నారి నుంచి ఆరేళ్ల వయసులోపు చిన్నారులను మాత్రమే దత్తత ఇస్తారు. అయితే కోరుకున్న సమయానికి దత్తత కావాలనుకునే వారికోసం ప్రత్యామ్నాయంగా మరో ప్రక్రియను మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ నిర్వహిస్తోంది. అదే ఫాస్టర్ కేర్ అడాప్షన్. ఈ దత్తతకు క్యాప్షన్‌గా 'కలిసొచ్చే కాలానికి.. నడిచొచ్చే పిల్లలు' అని పెట్టారు. అంటే చిన్నారులను కాకుండా కాస్త ఊహ తెలిసిన, పెద్ద వయసు పిల్లలను దత్తత ఇస్తారు. ఆరేళ్ల వయసు దాటి, 18 ఏళ్లలోపు పిల్లలను ఫాస్టర్ కేర్ అడాప్షన్‌లో దత్తత ఇస్తారు.

కొరవడిన అవగాహన..

పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే చాలా మందికి ఫాస్టర్ కేర్ అడాప్షన్‌పై అవగాహన లేదు. ఈ విధానం 2015 నుంచి అందుబాటులో ఉన్నప్పటికీ పెద్దగా తెలి యదు. అప్పుడే పుట్టిన చిన్నారి నుంచి ఆరేళ్లలోపు చిన్నా రులను దత్తత తీసుకునేందుకు దరఖాస్తులు వస్తున్నాయి. కానీ, ఫాస్టర్ కేర్ అడాప్షన్‌కు స్పందన లేదని అధికారులు చెబుతున్నారు. దీనికి అనేక కారణాలున్నాయి. పెద్ద పిల్లలను దత్తత తీసుకుంటే వారికి అన్నింటిపైనా అవగాహన ఉంటుంది. దత్తత తీసుకున్న తల్లిదండ్రులకు తాము పుట్టలేదన్న విషయం తెలుస్తుందన్న ఉద్దేశంతో చాలామంది ముందుకు రావడం లేదంటున్నారు.

జిల్లాలో ఇప్పటి వరకు ఒక చిన్నారిని మాత్రమే ఈ విధానంలో దత్తత ఇచ్చారు. ప్రస్తుతం నలుగురు బాలికలు ఫాస్టర్ కేర్ అడాప్షన్‌కు సిద్ధంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఈ అడాప్షన్ కోసం పదికిపైగా దరఖాస్తులు సీడబ్ల్యూసీలో పెండింగ్ ఉన్నాయి. ఈ ప్రక్రియపై అవగాహన కలిగిస్తున్నామని డీసీపీవో కె.హరికృష్ణ తెలిపారు. జిల్లాలోని 37 చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్స్‌లో ఉండే కొందరు చిన్నారులను ఫాస్టర్ కేర్ అడాప్షన్స్‌కు అర్హులుగా గుర్తించి దత్తత ఇస్తున్నామన్నారు. పిల్లలు లేని దంపతులకు ఈ ప్రక్రియపై ఆసక్తి ఉంటే తమను నేరుగా సంప్రదించాలని కోరారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు.

పుస్తక మహోత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, తదితరులు

మహారాణిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28 నుంచి నవంబరు 5 వరకు అనకాపల్లిలో నిర్వహిం చనున్న విజయవాడ పుస్తక మహోత్సవ (బుక్ ఫెస్టివల్) పోస్టర్‌ను బుధవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించారు.

జూలో నాగులచవితికి ఏర్పాట్లు

- ఉదయం 7.30 నుంచి అనుమతి

ఆరిలోవ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నాగుల చవితిని పురస్కరించుకొని పుట్టల వద్ద పూజలు నిర్వహించేందుకు వీలుగా ఈ నెల 25న (శనివారం) ఉదయం 7:30 గంటల నుంచి ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలను తెరుస్తున్నట్టు క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. భక్తుల సౌకర్యార్థం జూలో పుట్టలను పరిశుభ్రం చేయించామన్నారు. వచ్చే ప్రతి ఒక్కరూ టికెట్ తీసుకోవాలన్నారు. బాణసంచా కాల్చకూడదని, జంతువులు, పక్షులకు తినుబండారాలు, ప్రసాదాలు పెట్టవద్దన్నారు. ప్రశాంత వాతావరణంలో పండగ చేసుకోవాలని భావించే వారు జూకు వచ్చి నాగులచవితిని జరుపుకోవాలన్నారు.

ప్లాట్లు క్రమబద్ధీకరించుకోండి

సిరిపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అనధికారిక లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఈనెల 23లోగా క్రమబద్ధీకరించుకోవాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ ఒక ప్రకటనలో కోరారు. ఎల్ఆర్ఎస్-2020 ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని కొనుగోలుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనధికార లే అవుట్లలో ఈ ఏడాది జూన్ 30 లోగా ప్లాటు కొనుగోలు చేసిన వారికి ఈ అవకాశం కల్పించామన్నారు. ప్లాట్లు క్రమబద్ధీకరించుకుంటేనే, ఇళ్ల నిర్మాణానికి అనుమతులు, లే అవుట్లలో మౌలిక వసతులు వస్తాయన్నారు. నిర్దేశిత పత్రాలతో వీఎంఆర్‌డీఏలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పండగ ముగిసింది... చెత్త మిగిలింది!

- బాణసంచా వ్యర్థాలతో నిండిన ఏయూ మైదానం



విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ నేపథ్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం నార్త్ క్యాంపస్ మైదానంలో 50కు పైగా బాణసంచా విక్రయ దుకాణాలను ఏర్పాటు చేశారు. పండగ ముగియడంతో విక్రయాల కోసం ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తొలగించారు. ప్రస్తుతం ఈ మైదానంలో ఎటుచూసినా వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. మైదానం మొత్తం చెత్తా, చెదారంతో నిండిపోయి అధ్వానంగా మారింది. స్టాల్స్ నిర్వాహకులు వ్యర్థాలను తొలగించే చర్యలు చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి ఎదురయిందని పలువురు విమర్శిస్తున్నారు. ఏయూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'ఏయూ ప్రగతి నిర్దేశకులు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ, ప్రముఖులు

సీతమ్మధార, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం వందేళ్ల చరిత్రలో 19 మంది ఉప కులపతుల పాత్రపై ఆచార్య వి.బాలమోహన్‌దాస్, ఆచార్య ఎస్‌వీ సుధాకర్, ఆచార్య ఎస్ రామకృష్ణారావు రాసిన 'ఆంధ్ర విశ్వ కళాపరిషత్ ప్రగతి నిర్దేశకులు' పుస్తకావిష్కరణ బుధవారం డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో నిర్వహించారు. సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ (సిడార్), లంకపల్లి బుల్లయ్య కళాశాల నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ ఈఏఎస్ శర్మ మాట్లాడుతూ ఏయూకు స్వయం ప్రతిపత్తి, ఆర్థిక సుస్థిరత కల్పించాలన్నారు. తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో ముగ్గురు ఉపకులపతులు ఈ పుస్తకం రాయడం అభినందనీయమన్నారు. ఆచార్య వి.బాలమోహన్ దాస్ వీసీ పదం ప్రాముఖ్యతను తెలియజేశారు. విశిష్ట అతిథి జీఎస్ఎన్ రాజు రచయితలకు అభినందనలు తెలిపారు. ఏయూ చరిత్ర కలకాలం నిలిచేలా పుస్తకాన్ని రూపొందించామని రచయిత ప్రొఫెసర్ ఎస్‌వీ సుధాకర్ అన్నారు. ఏయూ చరిత్రను రాసే అవకాశం వస్తుందని ఊహించలేదని మరో రచయిత ఆచార్య ఎస్.రామకృష్ణారావు అన్నారు. బీలా సత్యనారాయణ, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, ఆచార్య ఎస్.రామకృష్ణ, ఎన్.వినయ్ భూషణ్‌రావు, బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ ప్రముఖులు, ఆచార్యులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గోవర్ధన పూజ



స్వామివారికి సమర్పించిన ప్రసాదాలు

ఆనందపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంభీరం పంచాయతీ ఐఐఎం రోడ్డులో ఉన్న రాధా కృష్ణ దేవాలయంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం గోవర్ధన పూజను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు గో పూజ, ఏడు గంటలకు గోవర్ధన పూజ, 8 గంటలకు దామోదర హారతి, అనంతరం శ్రీకృష్ణుడికి నెయ్యి దీపాల సమర్పణ, ప్రసాద వితరణ నిర్వహించారు. పలు రకాల పిండివంటలు, పండ్లు, మిఠాయిలతో అన్నకూట్‌ను ఏర్పాటు పూజ చేశారు. అనంతరం భక్తులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిష్కించన భక్తదాస, తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో...

సాగర్‌నగర్: స్థానిక ఇస్కాన్ మందిరంలో గోవర్ధన పూజ చేశారు. ఆలయ ఆవరణలో గోవర్ధన పర్వతాన్ని తలపించేలా అన్నం, స్వీట్లు, పండ్లతో అన్నకూట్ ఏర్పాటు చేశారు. గిరిరాజుకు పూజలు చేసి, 1,008 రకాల భోగాలను సమర్పించారు. అనంతరం ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస భక్తులకు గోవర్ధన గిరి పూజ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో మాతాజీ నితాయి సేవని, తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' పరిరక్షణకు జేఏసీ శంఖారావం

సిరిపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంటును పరిరక్షించే వరకు విశ్రమించమని విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ నేతలు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటుపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తోన్న ద్వంద్వ విధానాలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలన్నారు. ప్లాంటు అమ్మకాన్ని రద్దుచేస్తున్నట్టు వెంటనే ప్రకటించాలన్నారు.

ఇప్పటివరకు తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఉద్యమాలను ఉధృతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు రాంబాబు, నాగరాజు, అచ్యుతరావు, తదితరులు పాల్గొన్నారు.



నిరసన శిబిరంలో మాట్లాడుతున్న విద్యార్థి, యువజన సంఘాల నేతలు

జోరుగా రహదారి విస్తరణ పనులు

- కాన్వెంట్ జంక్షన్- షీలానగర్ మధ్య ఆరులేన్లుగా అభివృద్ధి
- 9.58 కిలోమీటర్లకు రూ.963.93 కోట్ల వ్యయం

మల్కాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్ వరకు వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. 9.58 కిలోమీటర్లున్న ఈ రహదారిని జాతీయ రహదారుల విభాగం, విశాఖ పోర్టు అథారిటీ విస్తరిస్తున్నాయి. ప్రస్తుతం నాలుగు లేన్‌లున్న రహదారిని ఆరులేన్లుగా తీర్చిదిద్దుతున్నారు. పనులను 2024 ఫిబ్రవరి 14న ప్రారంభించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 13నాటికి పూర్తిచేయాల్సి ఉంది. ఇందుకు రూ.963.93 కోట్లు కేటాయించారు. విశాఖ పోర్టు రూ.500 కోట్లు తన వాటాగా భరిస్తోంది. రేయింబవళ్లు పనులు సాగుతుండడంతో అనుకున్న సమయానికి పూర్తవుతుందని భావిస్తున్నారు. ఆరులేన్లుగా విస్తరిస్తుండడంతో ఈ రహదారిపై ప్రయాణం అనేక సమస్యలకు నిలయంగా మారింది. దుమ్ము, ధూళి రేగుతుండడంతో ద్విచక్ర వాహన చోదకులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిస్తే ఈ పరిస్థితి మరీ దారుణం. గోతుల్లో నీరుచేరి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ పరిస్థితిని సరిదిద్దడంపై అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఆరులేన్లుగా విస్తరిస్తున్న షీలానగర్- కాన్వెంట్ జంక్షన్ రహదారి



జాతీయ రహదారి పనులు జరుగుతున్న దృశ్యం

క్రైం... crime news

రాజమహేంద్రవరం వద్ద రోడ్డు ప్రమాదం

- ఫార్మాసిటీ కాలనీ కొత్తపాలేనికి చెందిన యువకుడి మృతి



కిరణ్‌కుమార్ (ఫైల్ ఫొటో)

అగనంపూడి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కడియపులంక సమీపంలో గల గోకుల్ నర్సరీ వద్ద బుధవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో అగనంపూడి ఫార్మాసిటీ పునరావాస కాలనీ కొత్తపాలేనికి చెందిన దాసరి కిరణ్‌కుమార్ (26) మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కిరణ్‌కుమార్ తన కారులో విజయవాడ వెళ్లి, తిరిగి వస్తుండగా హైవే పక్కన ఆగివున్న కారును అదుపు తప్పి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడి మరణ వార్త విని తల్లిదండ్రులు నీలకంఠరావు, శాంతి కుప్పకూలిపోయారు. ఒక్కగానొక్క కుమారుడు కానరాని లోకాలకు వెళ్లిపోయాడంటూ వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కిరణ్‌కుమార్ ఫార్మాసిటీలోని ఓ పరిశ్రమలో సేఫ్టీ విభాగంలో పనిచేసేవాడు. ఇంకా వివాహం కాలేదు.

బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

మహారాణిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయిన బాలుడిని 24 గంటల్లో వన్‌టౌన్ పోలీసులు గుర్తించి అతని తల్లిదండ్రులకు అప్పగించారు.బుక్కావారి వీధి కి చెందిన బాలుడు (15) మంగళవారంఅలిగి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కంగారుపడిన తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. సీఐ జి.డి.బాబు, ట్రైనీ ఎస్ఐ వినయ్ కుమార్ గాలింపు చేపట్టారు. నగరంలోని అన్ని పోలీసు స్టేషన్లకు వివరాలు అందించి బాలుడి ఆచూకీని తెలుసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు.

క్రికెట్ బెట్టింగ్ కేసులో మరో నలుగురి అరెస్టు

ఎండాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) క్రికెట్ బెట్టింగ్ కేసులో మరో నలుగురిని సైబర్ క్రైం పోలీసులు బుధవారం అరెస్టు చేసి, రిమాండ్‌కి తరలించారు. ఎక్సేంజ్ 666 ఆన్‌లైన్ యాప్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలానికి చెందిన గనగళ్ల బంగార్రాజు (31), విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలానికి చెందిన గడిదేశీ ఈశ్వరరావు (39), అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలానికి చెందిన కొరుప్రోలు పూర్ణ కిశోర్ (29), పరవాడ మండలానికి చెందిన మేడిశెట్టి రాజు (38)ను అరెస్టు చేశారు. వారి నుంచి మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

పాత్రికేయుడు మృతి



రామకృష్ణ (ఫైల్ ఫొటో)

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గాజువాక ఏరియాలో పాత్రికేయుడిగా పనిచేస్తున్న కారంగుల రామకృష్ణ (48) బుధవారం మృతిచెందారు. ఆయన భార్య లక్ష్మి, కుమారుడు గోపిచంద్‌తో కలిసి మిందిలో నివాసం ఉంటున్నారు. కొంతకాలంగా రామకృష్ణ అనారోగ్యంతో బాధపడుతున్నారు. కాగా బుధవారం తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశారు. రామకృష్ణ మృతదేహానికి తోటి విలేకరులతో పాటు, రాజకీయ నాయకులు నివాళులర్పించి, అతడి కుటుంబానికి సంతాపం తెలిపారు. రామకృష్ణ మృతదేహాన్ని స్వగ్రామమైన కృష్ణా జిల్లా జిల్లా తిరువూరుకు తరలించారు.

పోర్టుపాలెం రహదారికి టీడీఆర్ ఇస్తే న్యాయపోరాటం

- జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గోపాలపట్నం నుంచి పోర్టుపాలెం, పద్మనాభనగర్‌రోడ్డుకు టీడీఆర్ జారీ చేసేలా జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకుంటే న్యాయపోరాటం చేస్తానని జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ హెచ్చరించారు. మేఘాలయహోటల్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ, దేవస్థానం, గయాలుగా రెవెన్యూ రికార్డుల్లో ఉన్న భూముల్లో రోడ్డుకి రూ.700 కోట్ల విలువైన టీడీఆర్ ఇవ్వాలని ప్రైవేటు వ్యక్తులతోపాటు సీనియర్ ఎమ్మెల్యే జీవీఎంసీకి దరఖాస్తుచేస్తే అధికారులు సానుకూలంగా ఫైల్ సిద్ధం చేయడం దారుణమని, దీనికి మరో ఎమ్మెల్యే సిఫార్సులేఖను అందజేశారన్నారు. ప్రభుత్వభూములను పరిరక్షించాల్సిన వారే వాటిని కొట్టేయడానికి ప్రయత్నించడం ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీస్తోదన్నారు. టీడీఆర్‌కు దరఖాస్తుచేసినవారిని తాను బ్లాక్‌మెయిల్ చేస్తున్నానని ఆరోపించారని, తాను వారిని కలిసినా, ఫోన్‌లో మాట్లాడినట్టు నిరూపించి జీవీఎంసీ కమిషనర్, సీపీ, కలెక్టర్‌తోపాటు డిప్యూటీ సీఎం, సీఎంలకు ఫిర్యాదుచేస్తే చర్యలు తీసుకుంటారన్నారు.

అష్ఫకుల్లాఖాన్ వర్ధంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

ఏబీఎస్‌పీ జాతీయ సమన్వయకర్త జె.పూర్ణచంద్రరావు



అష్ఫకుల్లాఖాన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న పూర్ణచంద్రరావు, తదితరులు

సీతంపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు అష్ఫకుల్లాఖాన్ వర్ధంతిని ప్రభుత్వమే నిర్వహించాలని ఆలిండియా బహుజన సమాజ్ పార్టీ (ఏబీఎస్‌పీ) జాతీయ సమన్వయకర్త, మాజీ డీజీపీ జె.పూర్ణచంద్రరావు డిమాండ్ చేశారు. అష్ఫకుల్లాఖాన్ 125వ జయంతి సందర్భంగా బుధవారం పౌరగ్రంథాలయంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కాకోరి రైలు దాడిలో పాల్గొన్నందుకు ఖాన్‌ను బ్రిటిష్ ప్రభుత్వం 1927 డిసెంబరు 19న ఉరి తీసిందన్నారు. హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్‌లో పనిచేశారని, దేశం ప్రాణాలను లెక్కచేయకుండా పోరాటం చేశారన్నారు. ఏబీఎస్‌పీ తరపున అన్ని జిల్లాల్లో వీరుడికి నివాళులర్పిస్తామన్నారు. ముస్లిం, బీసీల వివక్షకు చట్టసభల్లో వారికి తగిన ప్రాతినిధ్యం లేకపోవడమే కారణమన్నారు. రాష్ట్రంలో ముగ్గురే ముస్లిం ఎమ్మెల్యేలు ఉన్నారని, ఏబీఎస్‌పీ ముస్లిం హక్కుల కోసం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఇక్బాల్, డాక్టర్ ఖాజా, ఇజాజ్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ఘనంగా స్వాతి నక్షత్ర హవనం



స్వాతి నక్షత్ర హవనం చేస్తున్న రుత్వికులు

సింహాచలం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో బుధవారం స్వాతినక్షత్ర హవనం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. నృసింహస్వామి ఆవిర్భావ నక్షత్రం స్వాతిని పురస్కరించుకుని ప్రతి నెలా ఆర్జిత సేవగా నిర్వహిస్తారు. సుదర్శన పెరుమాళ్‌ను ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై అధిష్ఠింపజేశారు. రూ.2500 టికెట్ చెల్లించి పాల్గొన్న 57 మంది ఉభయదాతల గోత్రనామాలతో ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు సంకల్పించారు. అష్టోత్తర శతనామావళితో అర్చన జరిపించారు. బింబారాధన, మండపారాధన, కలశారాధనలు చేసి హోమ కుండంలో వృద్ధాగ్నితో అగ్నిప్రతిష్ఠాపన గావించారు. పూర్ణకలశంతో బేడామండప ప్రదక్షిణ చేసి మూలవిరాట్ వద్ద ఉంచి పూజలు చేశారు. అందులోని పవిత్ర జలాలతో భక్తులను ప్రోక్షణ గావించారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రాల నడుమ పూర్ణాహుతితో హవనం పూర్తయింది. అనంతరం ఆర్జిత నిత్య కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.